



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 236 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శనివారం 3 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :236 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SAT 3 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




మూడేళ్ల తర్వాత అమరావతి సిటీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ మళ్లీ రావాలి: చంద్రబాబు

## అమరావతి ఒక నగరం కాదు...

# ఒక శక్తి

### అమరావతి పునర్ నిర్మాణానికి బటన్ నొక్కిన ప్రధాని మోదీ

- అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవం
- రాజధాని అమరావతిలో భారీ సభ
- లక్షలాది మంది సమక్షంలో రాజధాని పనులకు శ్రీకారం చుట్టిన మోదీ
- వర్చువల్ గా రూ.58 వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం
- ఏపీ సీఎం చంద్రబాబుపై ప్రశంసలు

గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రధాని మోదీకి ఘనంగా వీడ్కోలు పలికిన చంద్రబాబు, పవన్


వివరాలు 2లో..


## సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నోటీసులు

- నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీలకు నోటీసులు
- ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌పై వివరణ కోరిన కోర్టు
- కేసు తదుపరి విచారణ మే 7కు వాయిదా



పెన్ పవర్ డెస్క్: నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నోటీసులు జారీ చేసింది.


వివరాలు 2లో..


## నాకూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయి



- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు బెదిరింపు కాల్స్
- స్పీకర్‌కు వచ్చిన కాల్స్ గురించి అడగ్గా వెల్లడించిన సీఎం
- బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశం
- మంగుళూరు బజరంగ్ దళ్ కార్యకర్త హత్య నిందితులను పట్టుకోవాలని ఆదేశాలు


వివరాలు 2లో..


### మోదీ శంకుస్థాపన చేసిన

## అమరావతిని ఆపే దమ్ము ఎవరికీ లేదు

- అమరావతి పనుల పునఃప్రారంభ సభలో మంత్రి నారా లోకేష్ ప్రసంగం
- గత ప్రభుత్వ వైఖరిపై విమర్శలు, అమరావతి రైతుల త్యాగాలకు వందనం
- ప్రధాని మోదీ సహకారంతో అమరావతి అభివృద్ధి ఆగదని ధీమా
- పాక్ ఉగ్రదాడిపై తీవ్ర వ్యాఖ్యలు, కేంద్ర కులగణన నిర్ణయంపై హర్షం
- రాష్ట్రంలో భారీ పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయమని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేశారు. ఈ సందర్భంగా వెలగపూడిలో ఏర్పాటు చేసిన సభలో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రసంగించారు.


వివరాలు 2లో..


### అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా తయారవుతుంది...

## గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేసింది

- అమరావతి రైతుల పోరాటానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్న పవన్
- గత ప్రభుత్వం దివిసీమ ఉప్పెనలా అమరావతిని తుడిచి వేసిందని మండిపాటు
- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీ దూసుకుపోతుందని ధీమా


వివరాలు 2లో..




## ఢిల్లీ ఏఐసీసీ ఆఫీసులో..ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశం

- పహల్గామ్ ఉగ్రదాడి, కులగణనపై ఖర్గే కీలక వ్యాఖ్యలు
- పహల్గామ్ దాడి అనంతర పరిణామాలపై ప్రభుత్వ వ్యూహంపై విమర్శ
- ఉగ్రవాదంపై పోరాటానికి కేంద్రానికి విపక్షాల సంపూర్ణ మద్దతు ఉంటుందని పునరుద్ఘాటన
- మృతి చెందిన వారికి అమరవీరుల హోదా కల్పించాలని రాహుల్ గాంధీ డిమాండ్
- కులగణన కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ హర్షం

పెన్ పవర్ డెస్క్:పహల్గామ్ ఉగ్రదాడి జరిగి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం వద్ద స్పష్టమైన వ్యూహం కొరవడిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు రెండు


వివరాలు 2లో..




### కాలుష్యం కట్టిడికి..ఢిల్లీలో కొత్తగా 400 ఎలక్ట్రిక్ బస్సులు..

## 2025చివరినాటికి 2080 బస్సులు

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్ కట్టిడికి అక్కడి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా శుక్రవారం ( మే 2) 400 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం రేఖా గుప్తా ప్రారంభించారు. 2025 చివరినాటికి మరో 2080 బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఢిల్లీలో వాహనాలతో 45 శాతం కాలుష్యం సంభవిస్తుంది. వచ్చే ఏడాది నాటికి 100 శాతం ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్ ను ఏర్పాటు చేసే దిశగా ఢిల్లీ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం రేఖాగుప్తా అన్నారు. రాజధాని రవాణాను బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం


వివరాలు 2లో..




ఎడిటర్ వ్యూ

# చిక్కడు.. దొరకడు..నెల్లూరు నేతతో మజాకానా?

కాకాణి గోవర్ధన్ రెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏప్రిల్ మూడో తేదీన ఆయన పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా ఆయన మాత్రం దొరకడం లేదు. హైకోర్టులో కాకాణి గోవర్ధన్ రెడ్డి ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో ఆయన అప్పటి నుంచి అదృశ్యమయ్యారు. అప్పటి నుంచి దాదాపు ఏడు బృందాలు పోలీసులు నిరంతరం గాలిస్తున్నాయి. ఎక్కడా ఆయన ఆచూకీ దొరకడం లేదు. గత కొన్ని రోజులుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి కనిపెట్టలేకపోవడంతో పోలీసులపై ప్రభుత్వం పెద్దలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దాదాపు నెల రోజుల నుంచి కాకాణి తప్పించుకుతిరుగుతున్న పట్టుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

**విచారణకు హాజరు కాకుండా...**

గత కొన్ని రోజులుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీసుల విచారణకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. హైకోర్టులో కూడా ఆయనకు ముందస్తు బెయిల్ రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి తప్పించుకుతిరుగుతుండటంతో నెల్లూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు వెళ్లిన పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదయింది. విచారణకు హాజరు కాకుండా ఉన్న కాకాణిని ఎలాగైనా అరెస్ట్ చేయాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఎన్నిమార్లు ఇంటికి వెళ్లినా కుటుంబ సభ్యుల నుంచి మాత్రం ఒకటే సమాధానం. తమకు తెలియదని,

**సన్నిహితులపై నిఘా...**

కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో పాటు ఆయన ఎక్కడకు వెళ్లారన్నది అర్థం కాకుండా ఉంది. పోలీసులు అన్ని రకాలుగా నిఘా పెట్టారు. కాకాణి గోవర్ధన్ రెడ్డికి సంబంధించిన సన్నిహితుల పై కూడా కన్నేసి ఉంచారు. వారి ఫోన్లను కూడా ట్రాప్ చేస్తున్నారు. అయినా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాత్రంఎవరికీ ఫోన్లు చేయడం లేదు. ఇలా దాదాపు నెల రోజుల నుంచి పోలీసుల కళ్లుగప్పితప్పించుకుని తిరుగుతుండటం పోలీసులకు సవాల్ గా మారింది. అనుమానం వచ్చిన అన్ని ప్రదేశాల్లో వెదుకుతున్నా ఆయన ఆచూకీ ఇసుమంత కూడా దొరకకపోవడంతో ఉన్నతాధికారుల చేత చీవాట్లు తింటున్నారు. మొత్తం మీద కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీసులకు చిక్కడు దొరకడు అన్న రీతిలో తప్పించుకుతిరుగుతున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు.

# అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి

అమరావతి: ఏపీ ప్రజల చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతుందని ప్రధాని మోడీ అన్నారు. అమరావతి ఒక పుణ్య భూమి అని.. నేను ఈ పుణ్యభూమిపై నిలబడి మీ అందరితో మాట్లాడటం ఆనందంగా ఉందన్నారు. అమరావతి అంటే సాంప్రదాయం, పురోగతి అని.. స్వర్ణాంధ్ర నిర్మాణానికి అమరావతి ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. అమరావతి అంటే కేవలం ఒక నగరమే కాదని.. ఒక శక్తి అని అభివర్ణించారు. ఇవాళ దాదాపు రూ.60 వేల కోట్ల పనులకు శంఖుస్థాపనలు చేశా.. అయితే ఇవి కేవలం శంఖుస్థాపనలే కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్?కు బలమైన పునాదులని పేర్కొన్నారు. శుక్రవారం (మే 2) ఆంధ్రప్రదేశ్?లోని వెలగపూడిలో అమరావతి పునర్నిర్మాణ పనులను మోడీ ప్రారంభించారు. మొత్తం 18 ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. మోడీ చేతుల మీదుగా అమరావతి రీస్టార్ట్ పనులు షురూ అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోడీ మాట్లాడుతూ.. ఏఐ, ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్ ఇలా అన్ని రంగాల్లో అమరావతి కీలకంగా మారబోతుందని అన్నారు. అమరావతి ప్రతి వ్యక్తి కలల నిర్మాణమని.. త్వరలోనే వారి స్వప్నం సాకారం కాబోతుందని చెప్పారు.ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ఐటీ విజన్ అద్భుతమని.. ఆయన ఐటీ విజన్ ను నేను అప్పుడు గుజరాత్ సీఎంగా ఉండి పరిశీలించానని తెలిపారు. నాణ్యమైన ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలంటే చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని ప్రశంసించారు. 2015లో అమరావతి నిర్మాణానికి నేనే శంఖుస్థాపన చేశా.. పదేండ్లు ఏపీ అభివృద్ధి కోసం సహకరించామని పేర్కొన్నారు. ఏపీని వికసిత్ భారత్?కు గ్రోత్ ఇంజిన్?గా తయారు చేయాలని కోరారు. ఏపీలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలైందన్నారు.

దివంగత ఎన్టీఆర్ వికసిత్ ఏపీ కోసం కలలు కన్నారని.. మనమందరం కలిసి ఆయన కలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోని పలు అభివృద్ధి చెందిన దేశాలు రైల్వే వ్యవస్థపై ఫోకస్ చేశాయని.. ఇందులో భాగంగానే మేం కూడా రైల్వే వ్యవస్థను ప్రక్షాళిస్తున్నామని తెలిపారు. ఏపీకి రూ.9 వలే కోట్ల విలువైన రైల్వే బడ్జెట్ కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ రైల్వేలో వందశాతం విద్యుదీకరణ పూర్తి అయ్యిందని చెప్పారు.

**ఆ విషయంలో చంద్రబాబును మించిన నేత దేశంలో మరొకరు లేరు : ప్రధాని మోదీ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేశారు. రాజధాని పనులను వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ... అనంతరం తెలుగులో తన ప్రసంగం మొదలుపెట్టారు. దుర్గమ్మ తల్లి కొలువై ఉన్న పుణ్యభూమిలో మీ అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని వెల్లడించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, నా మిత్రుడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం, శక్తిమంతుడు పవన్ కల్యాణ్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని పేర్కొన్నారు. "ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నాను. నాకు కనిపిస్తోంది ఒక నగరం మాత్రమే కాదు... ఒక స్వప్నం సాకారం కాబోతోందన్న భావన కూడా కలుగుతోంది. ఒక కొత్త అమరావతి, ఒక కొత్త ఆంధ్రప్రదేశ్ సాకారం అవుతుంది. నేడు దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశాం. ఇవి కాంక్రీట్ నిర్మాణాలు మాత్రమే కాదు... ఏపీ ఆశలకు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదులు వేయబోతున్నాయి. నేను వీరభద్రస్వామికి, అమరలింగేశ్వరస్వామికి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి సాష్టాంగ ప్రమాణం చేస్తూ, ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఇంద్రలోకానికి రాజధాని అమరావతి... ఇప్పుడది ఆంధ్రప్రదేశ్ కు రాజధాని. స్వర్ణాంధ్ర ప్రదేశ్ కు శుభసూచకం. అమరావతి ఒక నగరం కాదు... ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్ ను ఆధునిక ప్రదేశ్ గా మార్చే శక్తి... ఆంధ్రప్రదేశ్ ను అధునాతన ప్రదేశ్ గా మార్చే శక్తి. ఐటీ, ఏఐ సహా అన్ని రంగాలకు అమరావతి కేరాఫ్ అడ్రస్ గా మారుతుంది. గ్రీన్ ఎనర్జీ, స్వచ్ఛ పరిశ్రమలు, విద్య, వైద్య కేంద్రంగా అమరావతి విలసిల్లుతుంది. అమరావతిలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుంది. టెక్నాలజీ నాతో మొదలైనట్లు చంద్రబాబు ప్రశంసించారు. కానీ నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాదులో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారులను హైదరాబాద్ పంపించి అక్కడి ఐటీ అభివృద్ధిని అధ్యయనం చేయించాను. భారీ ప్రాజెక్టులు చేపట్టాలన్నా, త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనులు పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో మరెవ్వరూ లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశాను. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అమరావతి అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సహకరించింది... ఇక ముందు కూడా సహకరిస్తుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు అందిస్తుంది.ఆనాడు ఎన్టీఆర్ వికసిత ఏపీ కోసం కలలు కన్నారు... ఈనాడు మనందరం కలిసి ఎన్టీఆర్ కలలను నిజం చేయాలి. వికసిత భారత్ కు ఏపీ ఒక గ్రోత్ ఇంజిన్ లా ఎదగాలి. చంద్రబాబు గారూ, పవన్ కల్యాణ్ గారూ... ఇది మనం చేయాలి... మనమే చేయాలి.

ఏపీలో కనెక్టివిటీ పరంగా కొత్త అధ్యాయం మొదలవుతోంది. నాయుడుపేట-రేణిగుంట హైవే అందుకు నిదర్శనం. తిరుపతి వెంకన్న దర్శనం కోసం వెళ్లే వారు ఎంతో త్వరగా ఈ రహదారిపై ప్రయాణించే వెసులుబాటు కలుగుతోంది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం వేల కోట్ల రూపాయల సాయం చేస్తోంది." అని ప్రధాని మోదీ వివరించారు.

## మూడేళ్ల తర్వాత అమరావతి సిటీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ మళ్లీ రావాలి: చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో అమరావతిని ప్రపంచం గర్వించేలా నిర్మిస్తామని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రాత్మక విజయం సాధించిందని చంద్రబాబు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉందని, ప్రధాని మోదీ అండతో దానిని తిరిగి గాడిలో పెడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైఎస్ఆర్‌సీపీ పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తీసుకొస్తున్నామని అన్నారు.

అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల సెంటిమెంట్ అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. రాజధాని నిర్మాణం కోసం నాడు 29 వేల మంది రైతులు తమ భవిష్యత్తును త్యాగం చేసి 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించారని గుర్తుచేశారు. చారిత్రకంగా అమరలింగేశ్వర స్వామి, కృష్ణానది, బౌద్ధారామాలకు నిలయమైన అమరావతి అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు చెప్పలేని కష్టనష్టాలు అనుభవించారని, వారి పోరాటం, త్యాగం మరువలేనిదని అన్నారు. అమరావతి ఉద్యమం లాంటి దాన్ని తన జీవితంలో చూడలేదని కొనియాడారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో అమరావతికి మళ్లీ ప్రాణం పోశారని వ్యాఖ్యానించారు.ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పునర్ నిర్మాణ పనులను ప్రారంభించుకోవడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజని చంద్రబాబు అభివర్ణించారు. ఐదు కోట్ల మంది ప్రజలు గర్వంగా 'ఇది మా రాజధాని' అని చెప్పుకునేలా అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలకు కేంద్రంగా, ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలతో అనుసంధానమై ఉండేలా, గ్రీన్ ఎనర్జీతో కాలుష్య రహిత నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తామని వివరించారు. అమరావతిలో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు చదువుకునేలా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు.

గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని స్థాపించి ఐటీ విప్లవానికి నాంది పలికామని, దానిని నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రారంభించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఏఐ (కృత్రిమ మేధ) రంగంలోనూ ఏపీ దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మూడేళ్ల తర్వాత అమరావతి నగరం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకున్నాక, మళ్లీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. అమరావతి అభివృద్ధికి మోదీ అందిస్తున్న సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశీస్సులు తమకు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. కేవలం అమరావతే కాకుండా, రాష్ట్రంలోని అన్ని 26 జిల్లాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.

## సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈ కేసులో దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, దీనిపై వివరణ ఇవ్వాలని వారిని ఆదేశించింది.గతంలో సరైన పత్రాలు లేవన్న కారణంతో నోటీసుల జారీకి నిరాకరించిన కోర్టు, తాజాగా ఈడీ అభ్యర్థన మేరకు చర్యలు చేపట్టింది. చార్జిషీట్‌పై విచారణకు ముందు నిందితుల వాదనలు వినాల్సి ఉందని ఈడీ కోర్టుకు తెలిపింది. ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఈ నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను మే 7వ తేదీకి వాయిదా వేశారు.

## నాకూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయి

**పెన్ పవర్ డెస్క్:**కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సైతం తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ యూటీ ఖాదర్‌కు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చిన విషయంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు."అవును.. నాకు కూడా బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చాం. బెదిరింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం" అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. తనకు వస్తున్న బెదిరింపులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ఇటీవల మంగళూరులో జరిగిన బజరంగ్ దళ్ కార్యకర్త సుహాస్ శెట్టి హత్య ఘటనపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. ఈ హత్య కేసులో ప్రమేయమున్న నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి, అరెస్టు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మంగళూరులో సుహాస్ శెట్టిని నడిరోడ్డుపై కొందరు దుండగులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన నేపథ్యంలో మంగళూరులో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. నగర పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధాజ్ఞలు విధించి, ప్రజలు గుంపులుగా గుమిగూడటాన్ని, ఊరేగింపులు, నినాదాలు చేయడాన్ని నిషేధించారు. సుహాస్‌ను పథకం ప్రకారమే హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినప్పటికీ, హత్యకు గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా తయారవుతుంది... గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేసింది

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ రాజ ధాని రైతులపై ప్రశంసలు కురిపించారు. ఒక్క పిలుపుతో రాజధాని కోసం వేలాది ఎకరాల భూమిని ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని కోసం అమరావతి రైతులు చేసిన పోరాటానికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని చెప్పారు. అమరావతి రైతులు కేవలం భూములు మాత్రమే ఇవ్వలేదని... రాష్ట్రానికి భవిష్యత్తును ఇచ్చారని అన్నారు. ధర్మ యుద్ధంలో అమరావతి రైతులు గెలుపొందారని చెప్పారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు తాము బాధ్యులుగా ఉంటామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. రాజధానిని అద్భుతంగా నిర్మించి అమరావతి రైతుల రుణం తీర్చుకుంటామని చెప్పారు. ఎన్డీయే కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో ఏపీ అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దివిసీమ తుపానులా అమరావతిని గత ప్రభుత్వం తుడిచిపెట్టిందని

విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు నలిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రైతుల త్యాగాలను మర్చిపోలేమని చెప్పారు.

పహల్గామ్ దుర్ఘటనలో 27 మంది మరణించారని... ఈ సమయంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ప్రధాని మోదీ అమరావతి కోసం ఇక్కడకు రావడం... అమరావతిపై ఆయనకున్న ఇష్టానికి నిదర్శనమని పవన్ అన్నారు. ఎంతో విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు అని కితాబిచ్చారు. ఎంతో దూరదృష్టితో హైదరాబాద్ లో హైటెక్ సిటీని నిర్మించిన చంద్రబాబు... ఇప్పుడు అమరావతికి శ్రీకారం చుట్టారని చెప్పారు. మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీ దూసుకుపోతుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఢిల్లీ ఏఐసీసీ ఆఫీసులో..ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశం

- మొదటి పేజీ తరువాయి

గంటల పాటు జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై చర్చించినట్లు ఖర్గే తెలిపారు.కులగణనపై తమ డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించడంపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై నిజాయతీగా పోరాడితే, మొండి ప్రభుత్వమైనా తలవంచక తప్పదని రాహుల్ గాంధీ నిరూపించారని పేర్కొన్నారు. అయితే, కులగణన ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించినప్పటికీ, దానిని ప్రకటించిన సమయం మాత్రం ఆశ్చర్యానికి గురిచేసిందని ఖర్గే వ్యాఖ్యానించారు. తమ పార్టీ డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గిందని, అయితే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడి అనంతర పరిస్థితులు, భద్రతా వైఫల్యాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. దేశ ఐక్యత, సమగ్రతకు భంగం కలిగించే ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీతో పాటు విపక్షాలన్నీ మద్దతుగా నిలుస్తాయని మరోసారి స్పష్టం చేశారు.ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాహుల్ గాంధీ పరామర్శించారని గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని, మృతులకు అమరవీరుల హోదా కల్పించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఉగ్రవాదాన్ని సమష్టిగా ఎదుర్కోవాలని సీడబ్ల్యూసీ అభిప్రాయపడినట్లు ఖర్గే వివరించారు.

## మోదీ శంకుస్థాపన చేసిన అమరావతిని ఆపే దమ్ము ఎవరికీ లేదు

**చంద్రబాబుపై కక్షతో...!**

గత ప్రభుత్వం చంద్రబాబుపై వ్యక్తిగత కక్షతోనే అమరావతిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసిందని మంత్రి లోకేశ్ విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో ఐదేళ్లు కాలయాపన చేశారే తప్ప, రాజధానిలో ఒక్క ఇటుక కూడా వేయలేదని ఆరోపించారు. అమరావతి కోసం 1,631 రోజుల పాటు అలుపెరగని పోరాటం చేసిన రైతుల త్యాగాలను ఆయన గుర్తుచేసుకున్నారు. "నాడు 8 ఏళ్ల పిల్లాడి దగ్గర నుండి 80 ఏళ్ళ వృద్ధుల వరకూ జై అమరావతి అంటూ జెండా పట్టారు. జై అమరావతి అన్నందుకు అనాడు రైతులకు సంకెళ్లు వేసారు, అమరావతి ఉద్యమంలో పాల్గొన్నందుకు మహిళా రైతుల్ని పోలీసుల బూటు కాలితో తన్నించారు. అమరావతి ఉద్యమంలో 270 మంది రైతులు చనిపోయారు. 3 వేల మంది పై అక్రమ కేసులు పెట్టారు. ఎన్ని కుట్రలు చేసినా జై అమరావతి నినాదాన్ని మాత్రం ఆపలేకపోయారు" అని వివరించారు.ఉద్యమంలో పాల్గొన్న రైతులపై అక్రమ కేసులు బనాయించారని, మహిళలపై దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని దీక్షతో పోరాడిన రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. "ఆపడానికి, పీకడానికి అమరావతి ఎవరి ఇంట్లో పెరటి మొక్క కాదు, ఇది జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

**ఇప్పుడు ఆపండి చూద్దాం...!**

ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతి అభివృద్ధి పనులు తిరిగి ఊపందుకున్నాయని, ఇక రాజధాని నిర్మాణాన్ని ఎవరూ ఆపలేరని ('అన్‌స్టాపబుల్' అని) లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆపే దమ్ము ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కార్ ఉందని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడతాయని అన్నారు.

### కాలుష్యం కట్టిడికి..ఢిల్లీలో కొత్తగా 400 ఎలక్ట్రిక్ బస్సులు..

## 2025చివరినాటికి 2080 బస్సులు

- మొదటి పేజీ తరువాయి

ఎలక్ట్రిక్ వెహికల్ (EV) విధానంపై పనిచేస్తోందని చెప్పారు. మరోవైపు దేశరాజధాని ఢిల్లీలో శనివారం ఉదయం భారీ వర్షాలు కురిశాయి. ఢిల్లీ వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై చెట్లుకూలిపోవడంతో ట్రాఫిక్ జామ్ తో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టుకూలి ఓ ఇంటిపై పడటంలో ముగ్గురు పిల్లలో సహా తల్లి చనిపోయింది.ఢిల్లీలో భారీ వర్షాలకు ప్రభావితం అయిన ప్రాంతాలను సీఎం రేఖాగుప్తా పరిశీంచారు. సహాయ చర్యలను మంత్రుల, అధికారులతో పర్యవేక్షించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు బాధపడకుండా అన్ని చర్యలు చేపట్టామని రేఖా గుప్తా చెప్పారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి పెట్టుబడుల అవసరం..

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

## ఔత్సాహుకులను ఆహ్వానించిన జిల్లా కలెక్టర్ మహేష్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అమలాపురం, మే 2 :** కోనసీమ జిల్లాలో సుమారు 93 కిలోమీటర్ల పొడవునా సముద్రపు తీరం సుప్రసిద్ధ దేవాల యాలు ఉన్నాయని, తద్వారా దేవాలయ బీచ్ పర్యాటక రంగ అభివృద్ధి చేసి నిర్వహణ కై వివిధ రిసార్ట్స్ హోటల్ రెస్టారెంట్ పెట్టుబడి దారుల ప్రతినిధులను ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు కాకినాడకు చెందిన అగామి ఫుడ్స్ హైదరాబాద్ కు చెందినవి హోటల్స్ రిసార్ట్స్, హైదరాబాదుకు చెందిన ఏ ఆర్ ఆర్ బి ఐ గ్రూప్ పెట్టుబడుదారుల ప్రతి నిధులను ఆహ్వానించి జిల్లాలో ఉన్న టూరిజం అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా టూరిజం అధికారి వెంకటా చలం అవగాహనను పెంపొం దించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకాన్ని అభివృద్ధికి ఏజెన్సీలు ముందుకు వస్తే అన్ని విధాలా సహకరించి ప్రణాళికా యుతంగా ఆలయ, బీచ్ సర్క్యూట్ పర్యాటకాన్ని ప్రోత్సహించనున్నట్లు వెల్ల డించారు. ప్రతిపాదిత సర్క్యూట్లో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాల గురించి ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. జిల్లాలో స్వదేశీ దర్శన్ స్కీములో వైనతేయి నదికి దగ్గరగా పాసర్లపూడి, ఆదుర్రు (బౌద్ధ స్తూపం) సముద్ర ముఖ ద్వారం వద్ద అన్ని విధాలుగా అభివృద్ధికి రిసార్ట్స్, రెస్టా రెంట్లు, బోటింగ్ వంటి అవకా శాలు బ్యాక్ వాటర్ తో ఉన్నాయని తెలిపారు. ఎస్.యానా%శీ% బీచ్ సముద్ర తీరం రిసార్ట్స్, వాటర్ స్పోర్ట్స్ వంటి అవకాశాల విస్తరణకు మూడు ఎకరాలు విస్తీర్ణంలో భూములు ఉన్నాయన్నారు. అదేవిధంగా కోటిపల్లి గోదావరి తీరంలో ఇప్పటికే నిర్మించిన రిసార్ట్స్ ఉన్నా యని వాటిని పూర్తిగా విని యోగంలో తెచ్చేందుకు అవకాశాలు అపారంగా ఉన్నాయన్నారు. ఆ దిశ గా ప్రతినిధులు సాధ్యసా ధ్యాలపై అధ్యయనం చేసి అభివృద్ధికి యోచన చేయా లని సూచించారు. అదే విధంగా ద్రాక్షారామం భీమే శ్వర స్వామి ఆలయం, కోటిపల్లి సోమేశ్వర స్వామి ఆలయం, అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి, ర్యాలీ జగన్మోహన్ స్వామి, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వంటి మేజర్ దేవాలయాలు 20 మరియు 17 బీచ్ లను సందర్శించేలా ఆలయ, బీచ్



సర్క్యూట్ టూరి జంకు అద్భుతమైన అవకాశాలు జిల్లాలో ఉన్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో దిండి రిసార్ట్స్ దిగ్విజయంగా నడుస్తోందన్నారు. ఆత్రే యపురం మండలం పేరవరం గ్రామంలో పిచ్చుకలంక ద్వీపం, చింతలమోరి బీచ్ లొల్లలాకులు వంటి ప్రక్రియ రమణీయత ఆహ్లాదకరంగా ఉండే సందర్శించాల్సిన అరుదైన ప్రాంతాలు జిల్లాలో ఎక్కువగా ఉన్నాయన్నారు. తీర ప్రాంతం వెంబడి టీవీ సీరియల్స్ సినీ పరిశ్రమ చిత్రీకరణ జరుగుతుంద ని వారికి ట్రెడిషనల్ గా రిసార్ట్స్, హోటల్స్, స్టే హోమ్స్ నిర్మిస్తే మరింత అభివృద్ధి చెం దేందుకు అవకాశాలు వస్తాయన్నా రు. ఈ ప్రాంతాలన్నీ పర్యావరణ హిత%శీ%గా కోస్టల్ రీజియన్ జోన్ పరిధికి లోబడి ఉన్నా యని ఆయన స్పష్టం చేశా రు. ఈ పర్యటనలు సాధా రణంగా ఇతివృత్తంతో ఈ సర్క్యూట్లలో పర్యాటకులకు పర్యాటక స్థలాల గురించి ఆ ప్రాంతం యొక్క సంస్కృతి గురించి మరింత సమాచారం అందించడానికి సహాయ పడతాయన్నారు. ఈ సర్క్యూట్లు గ్రామీణ ప్రాంతాల సంస్కృతిని, వివిధ ఆకర్షణ లను ఒకే ప్రయాణంలో చూడటానికి సహాయపడు తుందన్నారు. ప్రభుత్వం తరపున ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పిస్తామన్నారు. టెంపుల్, అడ్వెంచర్, ఎకో, వెల్ నెస్, హెరిటేజ్, రిలీ జియన్, సీప్లేన్ పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబ డిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీల తో ప్రోత్సహించడం జరుగు తుందన్నారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసాని చ్చారు. పర్యాటక రంగంలో విస్తృతమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని, వివిధ రకాలుగా పెట్టుబడులు పెట్టేందుకు, ఔత్సాహికులైన ప్రతినిధులను ఆహ్వానిస్తు న్నామన్నారు. పర్యాటకులను ఆకర్షిం చేలా సహజ, సాంస్కృ తిక వారసత్వాన్ని అందిస్తూ ప్రకృతి రమణీయంగా ఆహ్లా దంగా ఎక్కువ రోజులు గడిపేలా మెరుగైన సేవలు, మౌలిక వసతులకు పెద్దపీట వేసేందుకు నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లా లో కృషి జరగాల్సి ఉందన్నారు. పెట్టుబడి దారులు ముగ్గురు ప్రతినిధులు సమావేశం అనంతరం బీచ్, ఆల యాల సందర్శనకు పర్యాటక రంగ అధికారులతో కలిసి బయ లుదేరి వెళ్లారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పర్యాటక ప్రాంతీయ సంచాలకులు సిహెచ్ పవన్ కుమార్ అగామి ఫుడ్ కంపెనీ ప్రతినిధి ఎస్ మూర్తి చిత్తూరీ, ఆర్ వి గ్రూపు ప్రతినిధి ,సతీష్ వెంకటరమణ, వీ రిసార్ట్స్ హోటల్స్ ఎండి సంపత్, జనరల్ మేనేజర్ చంద్ర ప్రకాష్ ,మధు తదితరులు పాల్గొన్నారు.



## అర్జీల పరిష్కారం కోసం విచారణ చేపట్టిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, మే 2:** ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కార మార్గంలో తిరిగి(రీ ఓపెన్) వొచ్చిన అర్జీలు పరిష్కారం కోసం సంబంధిత అధికారి, ఫిర్యాదు దారుల ఇరువురి సమక్షంలో 51 అర్జీల విషయంలో విచారణ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో పిజిఆర్ఎస్ రీ ఓపెన్ అర్జీల పరిష్కార విషయమై విచారణ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ శుక్రవారం జిల్లా పరిధిలోని 51 అర్జీల విషయంలో విచారణ జరపడం జరిగిందని, వాటిలో 37 అర్జీలు సహేతుకమైన వాటిగా గుర్తించడం జరిగిందని, మరో 14 అర్జీలు వ్యక్తిగత, ఒత్తిడి వ్యూహాలతో కూడిన తప్పుడు ఫిర్యాదు చేయడం అలవాటు కలిగి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మండల పరిధిలో పరిష్కారం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పరిష్కారం అయ్యే అర్జీలు కేటగిరి వారీగా నివేదిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో మండలాలు వారీగా రీ ఓపెన్ అయిన అర్జీల విషయంలో పరిష్కార మార్గం సమీక్ష నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ సందర్భంగా 20 అర్జీలను అర్జిదారులు, సంబంధించి శాఖ అధికారి సమక్షంలో పరిష్కార స్థాయిపై చర్చించి, పరిష్కారం అయ్యే వాటికి సంబంధించి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. సంబంధిత శాఖ, మండల అధికారులు సమస్య పరిష్కారం కోసం వారు చేసిన సిఫార్సు, ఆ మేరకు అర్జీదారులు వివరణ తెలుసుకుని కలెక్టర్ వాస్తవ పరిస్థితిని వివరించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార మార్గం విషయంలో అర్హత కలిగిన, పరిష్కారం అయ్యే వాటి విషయంలో ఖచ్చితత్వం కలిగిన పరిష్కారం ఉండాలన్నారు. ఆ దిశలో చేపడుతున్న చర్యలలో భాగంగా అర్జీదారులతో ఇటువంటి సమీక్షలను ఇరువురి సమక్షంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పీజీఆర్ఎస్ డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మోటార్ల రిపేర్ల పనులు బిల్లుల చెల్లింపుల పేరిట కోట్లలో నిధులు కొల్లగొడుతున్నారు..!

**గ్రామాల్లో నీటి సరఫరాకు వినియోగిస్తున్న మోటర్ల నిర్వహణను గ్రామ పంచాయతీ కార్యదర్శులు గాలికి వదిలేసారు. గత ఐదేళ్లలో రిపేర్ ల పేరిట ఆర్థిక సంఘం నిధులు ఒక్కొక్క గ్రామపంచాయతీ లక్షల్లో బిల్లులు డ్రా చేశారు. మోటార్లకు చాలాచోట్ల కనీసం షెడ్డు కూడా లేకపోవడంతో అవి ఎండకు వేడెక్కి, వానకు తడిసి రిపేర్లకు గురవుతున్నా పట్టించుకునే నాధుడు లేడు. తాగునీటి నిర్వహణ ను రక్షిత నీటి సరఫరా విభాగం నుండి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అప్పగించింది. గ్రామ పంచాయతీల పాలకవర్గాలు, సిబ్బంది మోటార్లు ఎప్పుడు రిపేర్ కు వస్తాయా అని ఎదురు చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రిపేర్ల పేరిట పలు మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు కలిపి రూ. 50 లక్షలు నుండి రూ. 1 కోటి వరకు బిల్లులు చెల్లింపులు చేశారు. మోటార్లు ఎందుకు కాలిపోతున్నాయి. అసలు రిపేరు చేసిన మోటారు ఎన్ని రోజులు పని చేసిందన్న పరిశీలన ఉండటం లేదు. మోటార్ల మరమ్మతులకు, తాగునీటి నిర్వహణకు, గ్రామ పంచాయతీలు ఏటా గుత్తేదారులకు చెల్లిస్తున్న మొత్తం బ్లాక్ బుక్ లో ఈ సమాచారం అంతా నమోదు చేయాల్సి ఉన్నా, ఆ ప్రక్రియ సక్రమంగా సాగటం లేదు. పర్యవేక్షించాల్సిన మండల స్థాయి అధికారులు కుర్చీలు వదలడం లేదు. వారికి ప్రభుత్వం పరిశీలనకు ఇచ్చే కారు అలవెన్సును చక్కగా ఎంజాయ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.**

- **పంచాయితీ విద్యుత్ మోటార్ల పర్యవేక్షణ గాలిలో**
- **ఏటా ఒక్కో పంచాయతీ తాగునీటి నిర్వహణ వ్యయం రూ. 10 లక్షలు పైనే**

**ఏలూరు పెన్ పవర్ మే 2 :** ఏలూరు డివిజన్ వ్యాప్తంగా పలు మండలాల్లోని గ్రామ పంచాయితీల తాగునీటి నిర్వహణ, మంచినీటి చెరువులు నింపే విద్యుత్ మోటార్ల రిపేర్లు, వాటి స్పేర్ పార్టులు కొనుగోళ్లకు సంబంధించి గుత్తేదారులకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి చెల్లించిన బిల్లులపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో మండలంలో సగాసరి 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మైనర్, మేజర్ గ్రామపంచాయతీలు ఇదే బాటలో నడుస్తూ ఏడాదికి రూ. 5 లక్షల వరకు బిల్లులు చెల్లింపులు జరిగాయి. గత ఐదేళ్లలో ఇదే పరిస్థితి నెలకొని నేటికీ కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. మోటార్ల నిర్వహణ, పర్యవేక్షించే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులకు చిల్లులు పడుతున్నాయి. కొనుగోళ్లు, రిపేర్లకు, నిర్వహణకు పెట్టిన బిల్లులు వాస్తవంగా కొన్నారా? లేక బిల్లులు మాత్రమే పెట్టారా అనే దాని మీద పర్యవేక్షణ కరువైంది. అడిగిందే తడవుగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు కోరిన అంచనాలు మేరకు ఎస్టిమేషన్లు ఇచ్చి, లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని మండలాలను పరిశీలిస్తే, ఏలూరు మండలం మల్కాపురం గ్రామపంచాయతీలో గత ఏడాది సెప్టెంబర్ 11, 13 తేదీలలో మోటార్ రిపేర్లు పనుల కింద రూ. ఒక లక్ష 62 వేలు, ఇరిగేషన్ కాలువల పనుల కింద రూ.1 లక్ష,6 వేల రూపాయలు బిల్లులు చెల్లించారు. మాదేపల్లి పంచాయతీలో వాటర్ వర్క్స్, రిపేర్లు, స్పేర్ పార్టుల కొనుగోళ్ల కింద రూ. 3 లక్షల 79 వేలు బిల్లులు చెల్లించారు. ప్రత్తి కోళ్లంక పంచాయతీలో ఈ ఏడాది మార్చిలో ఓచర్ నెంబర్ 8,11ల ద్వారా రూ 1 లక్ష 14,500 బిల్లులు చెల్లించారు. ఇలా ఏ మండలంలో చూసినా విద్యుత్ మోటార్ల రిపేర్ల పేరిట లక్షల్లో చెల్లింపులు జరిగాయి. ప్రతి మండలం లోని పిఓపిఆర్డీలు టూర్ డైరీ ప్రకారము ఆయా మండల పరిధిలోని గ్రామపంచాయతీలను క్షేత్రస్థాయిలో పర్యటించి రిపోర్టు రాసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు లోపాలు ఉంటే నివేదించాలి. కానీ



ఈవోఆర్డీలు టూర్కు వెళ్లినట్లుగా డైరీలో రాసిన సందర్భాలను గత ఐదేళ్లలో వేళ్ళపై లెక్కించవచ్చు. వాటిపై ఎంపీడీవోలు చర్యలు తీసుకున్న దాఖలు లేవు. దీంతో రుచి గ్రామపంచాయతీ విద్యుత్ మోటార్ల రిపేర్లు బిల్లులు ఇష్టారాజ్యంగా పెడుతూ చెల్లింపులు జరిగాయి అన్న ఆరోపణలు వెలువడుతున్నాయి.

## ఎమ్మెల్యే నల్లమిల్లి బాల్య స్నేహితుడు గొలుగూరి జన్మదిన వేడుకలు...

**అనపర్తి పెన్ పవర్ మే 2 :** అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాల్య స్నేహితుడు గొలుగూరి వీర రాఘవరెడ్డి జన్మదిన వేడుకలను తెలుగుదేశం బిజెపి జనసేన నేతలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అనపర్తి మండలం రామవరంలో రామకృష్ణారెడ్డి స్వగృహం నందు ఈ వేడుకలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి ముందుగా వీర రాఘవ రెడ్డికి శాలువా కప్పి అభిమానులు ఏర్పాటు చేసిన కేక ని కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి ముల్లారెడ్డి సతీమణి సత్యవతి వీర రాఘవరెడ్డిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



WANTED

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లో 132కెవి సబ్ స్టేషన్ రాజోలు, ఏ పి ట్రాన్స్కో నందు ఐ. టీ. ఐ (ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణత అయిన BC -A కేటగిరీ,వయస్సు 18-35 మధ్య ఉన్న అభ్యర్థి కాంట్రాక్టు & ఔట్ సోర్సింగ్ లో పనిచేయటకు 10రోజులలో క్రింద ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు

M/s గౌరీ శంకర్ ఎలక్ట్రికల్
ఫోన్:8639975548

# కిషోర్ బాలికలు అప్రమత్తంగా ఉండాలి





● ఎంపీపీ కృష్ణారెడ్డి

**గంగవరం, పెన్ పవర్, మే 2:**ప్రస్తుతం సమాజంలో బాలికలు పై జరుగుతున్న ఆకృత్యాల నేపథ్యంలో బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కిషోర్ బాలికల వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కిషోరి వికాసం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగవరం లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఐసిడిఎస్ సూపర్వైజర్ టి సత్యవతి మాట్లాడుతూకిశోరి జాలికలకు 12 టాపిక్స్, ఆహార, ఆర్యోగం, విధ్య,రక్షణకొరకు, పోక్సో చట్టాలు , బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, మొదలగు వాటిపై క్లాసులు జరుగుతాయని ఈ క్లాసులు గ్రామ సచివాలయ మహిళా పోలీసులు కన్వీనర్ గా ఉంటూ ఏ ఎన్ ఎం, ఏ యు డబ్ల్యూ, ఏఎన్ఎం, ఎం పీ హెచ్ద బ్ల్యూ, వి యు,వి ఓ ఏ, వీరి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కిషోర్ బాలికలకు ఎటువంటి ఆరోగ్యసమస్యలు ఉన్న స్థానిక ఏఎన్ఎం తో నిర్భయంగా చెప్పి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని రుతుక్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలు సైబర్ నేరాలకు మోసపోవద్దని విద్య ప్రాధాన్యత

అలాగే కిషోర్ బాలికలు ఎక్కువగా నీళ్లు తాగాలని బాల్య వివాహాలు చేసుకోకూడదని మీ స్నేహితులు ఎవరైనా బాల్య వివాహాలు చేసుకున్నట్లు అయినా 1098నెంబర్ కి కాల్ చేసినట్లయినా బాల్య వివాహాలు చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటారని బాల్యవివాహాలు చేసుకున్నందువలన ఎన్నో అనర్ధాలకు గురవుతారని కిషోర్ బాలికలు పోషక ఆహారాలు కలిగినటువంటి ఆహారాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శు క్రవారం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన్యం బంద్ విజయవంతం



**వి.ఆర్.పురం పెన్.పవర్.మే 2 :**ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని,ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులతో భర్తీ చేయాలని,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రేఖపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం ఆదివాసి గిరిజన సంఘం,ఆదివాసీ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర ఏజెన్సీ బంద్ విజయవంతంగా జరిగిన బంద్ నేపథ్యంలో దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు.ప్రభుత్వ కార్యాలయాలు సైతం మూతపడ్డాయి.వాహనాలు తిరగకుండా గిరిజనులు రేఖపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తా రోకో చేపట్టారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి.అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ,ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం.రాజులు సి.పి.యం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,ఎంపీపీ కారం.లక్ష్మి, సర్పంచ్ పూనెం సరోజిని,ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్,కారం సుందరయ్య,సోయం చిన్నబాబు,తుర్రం బాబురావు, చిక్కాల రామారావు, పిసా కమిటీ సభ్యులు సారా పాండు, వేటగాని సూరి,వేటగాని మల్లయ్య,చిక్కాల పద్మారావు, పండ వెంకటేశ్వర్లు, కుంజా కన్నయ్య,సోడి మల్లయ్య,నాని, మొట్టు%శీ% గంగరాజు,పూనెం కిరణ్ కుమార్,ఆత్మకూరి కాంతారావు,గొంది దారయ్య,తోడం అనిల్, కిషోర్,దారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రేస్ మందిర్ లో మేగా చిల్డ్రన్ బైబిల్ శిక్షణ తరగతులు





**జీలుగుమిల్లి, పెన్ పవర్, మే 2:** విద్యార్థులు చిన్ననాటి నుండే దేశభక్తి ,క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటే పెద్దయిన తర్వాత మంచి స్వభావం కలిగి అభివృద్ధి చెందిన వారు అవుతారని గ్రేస్ మందిర్ వ్యవస్థాపకులు పాస్టర్ బి ఏజ్రా శాస్త్రి ,నిర్మల శాస్త్రి అన్నారు .శుక్రవారం జీలుగుమిల్లి గ్రేస్ మందిరలో ఐదు రోజులుగా మెగా చిల్డ్రన్ బైబిల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యం నుండి మంచి మార్గమును చూపించినట్లయితే వీరి భవిష్యత్తు బాగుంటుందని వారు అన్నారు .పరిశుద్ధ జీవితం, నమ్మకత్వం, పెద్దలపట్ల గౌరవం, ఆరోగ్య నియమాలు పాటించడం తో పాటు బైబిల్ వర్తమానాలు జ్ఞాన సూక్తులు వంటివి పిల్లలకు నేర్పించడం జరిగిందని అన్నారు. ఆటలు పాటలు నిర్వహించారు బైబిల్ క్విజ్ పోటీలలో ,క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. గ్రేస్ మందిర్ ద్వారా గత 20 సంవత్సరాల నుండి ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు .సుమారు 250 మంది విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఐదు రోజులపాటు ఉచితంగా ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం సాయంత్రం స్నాక్స్ అందజేయడం జరిగిందని వారు అన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఉపాధ్యాయులు కే టోనీ, ఎం తిరుపతిరావు, కృపా జ్యోతి ,స్పందన, నళిని, స్వరూప ,మనీషా, భవాని, సంఘస్తులు పాల్గొన్నారు.

# జగద్గురు ఆదిశంకరాచార్య, భగవద్రామానుజాచార్య జయంతి కార్యక్రమం



**గోకవరం, పెన్ పవర్, ఏప్రియల్ 02 :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అవతార పురుషులైనటువంటి మహాత్ములు జగద్గురు ఆదిశంకరాచార్య, భగవద్ రామానుజాచార్య జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక దేవి చౌక్ లోని శ్రీ కనకదుర్గ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ అర్చకులు వల్లూరి శ్రీనివాస శర్మ , విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు జగద్గురువుల చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్తు రాజమండ్రి జిల్లా ప్రచార ప్రముఖు ఉంగరాల ఆది విష్ణు మాట్లాడుతూ సాక్షాత్తు కైలాస శంకరుడే కేరళ రాష్ట్రంలోని కాలడి అనే గ్రామంలో శివగురు ఆర్యాంబ అనే పుణ్య దంపతులకు కుమారుడిగా ఆదిశంకరాచార్యుడిగా జన్మించి చిన్నతనములోనే తండ్రిని కోల్పోయి తల్లి యొక్క పర్యవేక్షణలో కొద్దికాలం మాత్రమే ఆ గ్రామంలో నివాసం ఉండి తదుపరి తల్లి అనుమతితో సన్యాసాన్ని స్వీకరించారని అన్నారు.ఆ సేతు హిమాచల పర్యంతము భారతదేశం అంతా పాదయాత్ర చేసి ఈ లోకములో శైవము వైష్ణవము వేర్వేరుకాదని 'శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే' అని చెప్పి సనాతన ధర్మములో రెండు మార్గాలు లేవు ఒకటే మార్గము అదే అద్వైతము అని చాటి చెప్పి సనాతన ధర్మములోనే బేదాభిప్రాయాలతో వర్గ విభేదాలతో అంత కలహాలతో అజ్ఞానముతో అలమటిస్తున్న హిందూ సమాజాన్ని అద్వైత సిద్ధాంతముతో ఏకత్రాటిపైకి తీసుకువచ్చి సమాజంలో జ్ఞాన జ్యోతులను వెలిగించిన దైవ స్వరూపులు ఆది శంకరాచార్యులు అని ఆదివిష్ణు చెప్పారు.అదేవిధంగా భగవద్ రామానుజులు కూడా సాక్షాత్తు శ్రీమన్నారాయణుని నివాసమైన వైకుంఠంలో కొలువై ఉండే ఆదిశేషుని అవతారమని, శ్రీమహావిష్ణువు శ్రీరాముడిగా జన్మించినప్పుడు ఆదిశేషుడు లక్ష్మణ స్వామిగా జన్మించారని, అదేవిధంగా ద్వాపర యుగములో శ్రీహరి శ్రీకృష్ణుడిగా అవతరించినప్పుడు ఆదిశేషుడు బలరాముడిగా అవతరించి ఆ శ్రీమహావిష్ణువుకి సోదరులుగా జన్మించి సేవలందించారని కలియుగంలో శ్రీమహావిష్ణువు శ్రీ వేంకటేశ్వరునిగా తిరుమల తిరుపతిలో అవతరించగా ఆదిశేషుడు భగవద్ రామానుజులుగా అవతరించి భగవంతుని యొక్క వైభవాన్ని లోకానికి చాటి చెప్పి పండిత పామర బేధము లేకుండా అందరికీ మోక్ష మార్గాన్ని మార్గదర్శనం చేసిన మహనీయుడు భగవద్ రామానుజాచార్యులని ఆయన అన్నారు .ఈ ఇరువురు మహాత్ములు వైశాఖ శుద్ధ పంచమి రోజున ఈ లోకంలో అవతరించారని భారతీయ సనాతన ధర్మానికి వీరు ఇరువురు మార్గదర్శకులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు ఇనకోటి బాపన్న దొర, బిజెపి నాయకులు బత్తుల నానాజీ, దేశాల నరేష్, ఆదం మణికంఠ,కరణం కోటేశ్వరరావు, టిడిపి నాయకులు గుండా శివప్రసాద్, జనసేన నాయకులు దోసపాటి సుబ్బారావు, స్థానిక వైద్యులు విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# కిశోరి వికాసం క్లాసులు ప్రారంభం





**ఆత్రేయపురం పెన్ పవర్ మే 2:**మండలంలోని ర్యాలి గ్రామంలో కిషోర్ వికాస్ పేరు తో సమ్మర్ క్లాసులను గ్రామ సర్పంచ్ కొడమంచిలి లక్ష్మీ, కూటమి నాయకులు శు క్రవారం ప్రారంభించారు. కొత్తపేట నియోజకవర్గం ప్రాజెక్ట్ ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ప్రారంభమైన కిషోర్ వికాస్ సమ్మర్ క్లాసులు వారం లో రెండు రోజులు జరుగుతాయన్నారు.

2/5/25 నుండి 10/6/25 వరకు, జరిగే రెండు రోజులు మంగళవారం, శుక్ర వారం. సమ్మర్ క్లాసులు నిర్వహిస్తామని అంగన్వాడి సూపర్వైజర్ కె. పద్మావతి తెలిపారు. కిశోరి జాలికలకు 12 టాపిక్స్, ఆహార, ఆర్యోగం, విధ్య,రక్షణకొరకు, పోక్సో చట్టాలు కొరలు, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలులు, మొదలగు వాటిపై క్లాసులు జరుగుతాయని ఈ క్లాసులు గ్రామ సచివాలయ మహిళా పోలీసులు కన్వీనర్ గా ఉంటూ ఏ ఎన్ ఎం, ఏ యు డబ్ల్యూ, ఏఎన్ఎం, ఎం పీ హెచ్ద బ్ల్యూ, వి యు,వి ఓ ఏ, వీరి ఆధ్వర్యంలో నిర్వహించబడును. ఈ కార్యక్రమానికి అతిథులుగా ర్యాలి గ్రామ టిడిపి నాయకులు పెండెం వెంకన్న , ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలింగ్ రవిచంద్ర, గోపి కూటమి నాయకులు అంగన్వాడి సూపర్వైజర్ కె. పద్మావతి,అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

# మోదీ జీ ... అమరావతి మీకు స్వాగతం పలుకుతుంది.

● మోదీ కి ఆహ్వానం పలికిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి...



**అనపర్తి,పెన్ పవర్,మే 2 :** మోదీజీ అమరావతి మీకు స్వాగతం పలుకుతుంది.. అంటూ అనపర్తి బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అమరావతి అభివృద్ధి పనులకు ప్రారంభానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి విచ్చేసిన సందర్భంగా ఆహ్వాన కమిటీలో బాధ్యులుగా ఉన్న రామకృష్ణారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆ సందర్భంలో మోడీ కూడా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గురించి పరిచయం చేస్తూ ఈయన బిజెపి ఎమ్మెల్యే అని, మంచి నాయకుడని పరిచయం చేశారు. బిజెపి ఎమ్మెల్యే అని పరిచయం చేస్తున్న సమయంలో వెరీ గుడ్... కీప్ ఇట్ అప్ అంటూ అభివాదం చేశారని రామకృష్ణారెడ్డి తెలిపారు.

# కిమ్స్ ప్రాంగణం లో గల శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో వైభవంగా ప్రారంభ మైన దశమ వార్షిక బ్రహ్మోత్సవములు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అమలాపురం, మే 2 :**కిమ్స్ ప్రాంగణం లో గల శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో దశమ వార్షిక బ్రహ్మోత్సవములు సందర్భంగా పద్మశ్రీ డా.మాడుగుల నాగ ఫణి శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది.

కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో మూడు రోజుల పాటు దశమ వార్షిక బ్రహ్మోత్సవములు వైభవ పేతంగా సాగునున్నాయి.

మొదటి రోజు శుక్ర వారం ఉదయం సంకల్పము, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనముతో ఘనంగా ప్రారంభమయ్యాయి. కె.రవి కిరణ్ వర్మ-శ్రీమతి శేషపవిత్ర దంపతులు దీక్షాధారణ చేసిన తదుపరి స్వామి వారిని పెండ్లి కుమారుని, దేవేరులను పెండ్లి కుమార్తెలను చేసి అర్చనలో పాల్గొన్నారు. సాయంత్రం అంకురార్పణ, వాస్తు హెూమం, ధ్వజారోహణ కార్యక్రమాలు, ప్రత్యేక అర్చనలు జరిపారు.

సాయంత్రం 5 గంటలకు జరిగిన పద్మశ్రీ పురస్కార విజేత, పూజ్య గురువులు, అవధాన బ్రహ్మ, ధార్మిక వరేణ్య, ప్రవచన సార్వభౌమ, బ్రహ్మశ్రీ డా. మాడుగుల నాగఫణి శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం అందరినీ ఆకట్టుకుంది. పద్మశ్రీ డా. మాడుగుల నాగఫణి శర్మ ని కె.వి. వి. సత్యనారాయణ రాజు ,శ్రీమతి బదరీ లక్ష్మి దంపతులు, కె.రవి కిరణ్ వర్మ-శ్రీమతి శేషపవిత్ర దంపతులు ఘనంగా సన్మానించారు.

మూడు రోజుల పాటు జరుగు ఈ బ్రహ్మోత్సవములలో భాగంగా రెండవ రోజు 3 వ తేదీ శని వారం ఉదయం 5 గంటల నుండి అర్చన, లక్ష్మి హెూమం, నీరాజనం మరియు మంత్రపుష్పం కార్యక్రమాలు జరుగును. తదుపరి 8 గంటలకు స్త్రీలచే సామూహిక కుంకుమ పూజ జరుగును. సాయంతం 5 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహెూత్సవము తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని చైర్మన్ చై తన్య రాజు తెలిపారు.

మూడవ రోజు అనగా మే నెల 4 వ తేదీ ఆది వారం ఉదయం సుదర్శన హెూమమం, పూర్ణాహుతి, చక్ర స్నానం తదితర కార్యక్రమాలు జరుగుతాయాన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు అర్చన, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులే అని, అమలాపురం పరిసర ప్రాంతముల భక్త మహాశయులందరూ ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొని, శ్రీ స్వామి వారి సేవలో తరించవలసినదిగా కిమ్స్ ఛైర్మన్ కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) తెలిపారు..

# తండాలో ఉపాధి హామీ పనులు కల్పించాలి- భూక్యా వేణుగోపాల్



**టీ నర్సాపురం, పెన్ పవర్, మే 2:** టి.నర్సాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో మణి కుమారిని బంజారా భజరంగీభేరి సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్ కలిసి వినతి పత్రం అందజేశారు. గిరిజన గ్రామమైన కృష్ణాపురం తండాలో లంబాడీలు పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం కిందవారికిపను లుకల్పించాలని,వ్యవసాయ సీజన్ పనులు మొదలయ్యే వరకు తండాలో ఉన్న లంబాడీలకు పనులు వెంటనే కల్పించాలని కోరారు. ఆ అభ్యర్థనకు ఎంపీడీవో మణి కుమారి సానుకూలంగా స్పందించారని అన్నారు.

# అమలాపురం లో ఘనంగా భగవత్ రామానుజాచార్యుల 1008వ తిరుమనక్షత్రం(జన్మదినోత్సవము)



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అమలాపురం, మే 2 :** భగవత్ రామానుజాచార్యుల 1008వ తిరుమనక్షత్రం(జన్మదినోత్సవము)సందర్భంగా శుక్రవారం ఉదయం అమలాపురం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వాసవి ఫంక్షన్ హాలునందు రామానుజాచార్య స్వామి వారి చిత్రపటాన్ని పూలమాలలు వేసి వారులోకానికి చేసిన సేవలను స్మరించుకున్నారు

ఈ సందర్భంగా రామానుజదాసుడు వరదా సూరిబాబు మాట్లాడుతూ రామానుజుల వారు 120 సంవత్సరముల పాటు ఈ భూమిపై నడయాడే దైవంగా కొలవబడ్డారని ఆయన గురువుల వద్ద పొందిన అష్టాక్షరి మహామంత్రాన్ని గురువు ఆజ్ఞ ధిక్కరించి గుడి గోపురం పై నుండి సామాన్య ప్రజలకుసైతం ఆ మంత్రాన్ని ముత్యాలవలె వెదజల్లారని ఈ విషయం తెలిసిన గురువు రామానుజుల వారిని గురువు ఆజ్ఞ ధిక్కరిస్తే నరకానికి పోతావు తెలియదా రామానుజన అన్నప్పుడు అంతమంది ఈ మంత్రాన్ని పొంది బాగుపడుతున్నప్పుడు తాను ఒకడిని నరకానికి పోయిన సిద్ధమేనని గురువుకి చెప్పినప్పుడు గురువుగారు రామానుజుల వారిని కౌగిలించుకుని మీ సేవలు అమోఘమని ఎంబెరుమానారే అనే బిరుదును ప్రసాదించారని అంతటి మహోన్నతమైనటువంటి మహానుభావుని జన్మదినోత్సవంలో మనమందరం పాల్గొనడం అదృష్టంగా భావించాలని వరదా సూరిబాబు అన్నారు అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు

ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన్న వీరన్న, కో చైర్మన్ నూలు శ్రీనివాసు, రామానుజదాసుడు వరదా సూరిబాబు, సంఘ కార్యవర్గ సభ్యుడు నూలు కృష్ణ, మండవిల్లి నాగేశ్వరరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి యె%శీ%దూరి సీతామహాలక్ష్మి, అమలాపురం ఆర్యవైశ్య మహిళా విభాగ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రూఫ్ టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలి

జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి





**కాకినాడ.పెన్ పవర్ మే 2 :** పియం సూర్యఘర్ పథకంపై మండల, గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించి అత్యంత ప్రయోజనదాయకమైన రూఫ్ టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను కోరారు.శుక్రవారం జడ్పి సమావేశ మందిరంలో తూర్పు గోదావరి జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు జడ్పి చైర్మన్ వేణుగోపాలరావు, ఆయా సంఘాల చైర్మన్ ల అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 4 నూతన జిల్లాలో అమలౌతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతని ఆయా అంశాల స్థాయి సంఘాలు సమీక్షించి, మరింత పటిష్ట, సత్వర అమలుకు అధికారులకు సూచనలు చేసాయి. ఆర్థిక, ప్రణాళిక అంశంపై చర్చలో గ్రామ పంచాయితీలకు రావలసిన స్టాంపుడ్యూటీ, సీనరేజి సర్థుబాటు చెల్లింపులను వెంటనే జరపాలని, పంచాయితీల పరిధిలో జరిగే అన్ని పనులకు తప్పని సరిగా పంచాయితీ తీర్మానాలతోనే నిర్వహించాలని సంఘాల సభ్యులు కోరారు. అలాగే ఇప్పటికే చేసిన పనులకు సత్వరం చెల్లింపులు జరపాలని కోరారు. గ్రామీణాభివృద్ధిపై చర్చలో కొత్తగా పింఛన్ల మంజూరు కోసం వేచి ఉన్న అర్హులైన లబ్దిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని, ఇందుకు సంబంధిత వెబ్ సైట్ ను ఓపెన్ చేయాలని సభ్యులు కోరారు. స్త్రీ,శిశు సంక్షేమంపై చర్చలో బాలికల రక్షణ, శారీరక,మానసిక వికాసం లక్ష్యంగా జిల్లాలో శుక్రవారం నుండి నిర్వహిస్తున్న కిశోరి వికాసం సమ్మర్ కాంపేయిన్ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను కూడా తప్పని సరిగా భాగస్వాములను చేయాలని సభ్యులు కోరారు. సంక్షేమ శాఖల చర్చలో వివిధ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్న స్వయం ఉపాధి యూనిట్ల కొరకు లబ్దిదారుల ఎంపికలో జడ్పిటిసి సభ్యుల సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ చర్చలో పిహెచ్సిలలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసి వైద్య సేవలకు విఘాతం లేకుండా చూడాలని సభ్యులు కోరారు. విద్య అంశంపై చర్చలో పదవతరగతి పరీక్షలలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సాధించిన పతితాలను సమీక్షించి, ఈ సంవత్సరం మరింత మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు. విద్యుత్ శాఖ పై చర్చలో పియం సూర్యఘర్ పథకం ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అవకాశం ఉన్న ప్రతి కుటుంబం రూఫ్ టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకుని ప్రయోజనం పొందేలా అవగాహన కల్పించాలని జడ్ పి చైర్మన్ వేణుగోపాల రావు అధికారులను కోరారు. జిల్లాలో కాలువ మూసివేత సమయంలో చేపట్టవలసిన నిర్వహణ, మరమ్మత్తుల అవసరాలపై చర్చించేందుకు ఆ శాఖ ఎస్ఈ సమావేశానికి రాకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. స్థాయి సంఘాలు చర్చించి సూచించిన అంశాలన్నిటిపై నూతన జిల్లాల అధికారులు సత్వర చర్యలు చేపట్టి, రానున్న సర్వసభ్య సమావేశంలో వాటిని వివరించాలని జడ్ పి చైర్మన్ కోరారు.ఈ సమావేశంలో వ జడ్పి వైస్ చైర్ పర్సన్ బుర్రా అనుబాబు, జడ్పి సిఈఓ వివివిఎస్ లక్ష్మణరావు,డిప్యూటీ సిఈఓ రామ్ గోపాల్, జడ్పిటిసి సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యువత విశాలమైన ఆలోచన దృక్పథం కలిగి ఉండాలి

**పి రామచంద్ర రాజు, ఐ ఆర్ సి ఎస్, రాష్ట్ర శాఖ ట్రెజరర్**




**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 2 :** స్థానిక ఆదిత్య డిగ్రీ,పీ జీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ, కాకినాడ శాఖ వారిచే యూత్ రెడ్ క్రాస్ రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ,పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల రాష్ట్ర స్థాయి సదస్సును ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల( స్వయం ప్రతిపత్తి ) లో ప్రారంభించారు.ఈ నెల 2 నుండి 5 వ తారీఖు వరకు జరగనున్న ఈ సదస్సులో రాష్ట్ర నలుమూలల నుండి యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు విచ్చేశారు.హెన్రీ ద్యూనాంట్ చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన మరియు ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాకినాడ ఐ ఆర్ సి యస్ వైస్ చైర్మన్ , ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి మాట్లాడుతూ కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ విధమైన సదస్సులు భావ వినిమయానికి దోహదపడతాయని అన్నారు. సదస్సులో జరిగే అంశాలు విద్యార్థులు బాగా నేర్చుకుని సమాజ సేవకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ సదస్సులో పాల్గొనే వాలంటీర్లకు కెరీర్ గైడెన్స్ కమ్యూనికేషన్స్ వంటి అంశాలను జోడించామని తద్వారా వ్యక్తిత్వ వికాస అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. గౌరవ అతిథి ఐ ఆర్ సి ఎస్ రాష్ట్ర శాఖ కోఆర్డినేటర్ బి వి ఎస్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 21 బ్లడ్ బ్యాంకులు ఉన్నాయని వాటి ద్వారా ప్రజా అవసరాలకు కావలసిన రక్తాన్ని అందిస్తున్నామని, తల సేమియా పిల్లలకు రక్తదానం చేస్తున్నామని అన్నారు. కాకినాడ రెడ్ క్రాస్ సెక్రెటరీ కే శివకుమార్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. సదస్సును సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ కోశాధికారి పి రామచంద్ర రాజు మాట్లాడుతూ యువత సంకుచిత భావాలను విడనాడి విశాల దృక్పథం కలిగి ఉండాలని అన్నారు.191 దేశాలలో సేవలు అందిస్తూ మూడు నోబెల్ శాంతి అవార్డులను అందుకున్న ఏకైక సంస్థ రెడ్ క్రాస్ సొసైటీ అని అన్నారు. విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని అన్నారు.సింగిల్ యూస్ ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమాన్ని చేపడుతున్నామని దానిలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.సదస్సులో పాల్గొన్న యూత్ రెడ్ క్రాస్ వింగ్ వాలంటీర్లను అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమాలలో రెడ్ క్రాస్ రెడ్ క్రిసెంట్ పై అవగాహన, ప్రిన్సిపల్స్, రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరాసర ప్రసంగించారు.మధ్యాహ్నం కార్యక్రమాలలో జూనియర్,యూత్ రెడ్ క్రాస్ ఇన్ కార్యక్రమాలపై డాక్టర్ జి ఎన్ వి ఏ బి మహాలక్ష్మి ప్రసంగించారు. అనంతరం కాకినాడలో రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న వివిధ సేవా క్షేత్రాలను సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె కరుణ, నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, కోఆర్డినేటర్లు ఎస్ దుర్గా దేవి, ఎస్ సత్యనారాయణ,ఎస్ మల్లేశ్వరరావు,వి చిరంజీవి,వి నాగరాజు,వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఆంధ్ర రాష్ట్ర చరిత్రకు ఒక మేలిమి మలుపు అమరావతి నిర్మాణం-ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ.పెన్ పవర్ మే 2 :** ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి పున: ప్రారంభోత్సవ నిర్మాణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతులు మీదుగా ప్రారంభించడం ఆంధ్ర రాష్ట్ర చరిత్రకు ఒక మేలిమి మలుపు కానుందని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు వనమాడి మోహన్ వర్మ పేర్కొన్నారు.ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో కాకినాడ నగరం నుండి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, మోహన్ వర్మ కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంగణం నందు బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి పునర్మాణ పనులకు, 49 వేలకోట్లతో చేపట్టు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించడం శుభదాయకమని,ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అమరావతి అనే రాజధాని ఉందని ప్రతి ఆంధ్రుడు గర్వంగా తలెత్తుకునేలా ముఖ్యమంత్రి విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని,గత పాలకులు రాజధాని నిర్మాణ పనులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురైనా చివరకు అమరావతి ప్రాంత ప్రజలు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తుమ్మల రమేష్, పెనుపోతు రాము, ఎరుపెల్లి రాము, పినపోతు జీవరత్నం, సీకోటి అప్పలకొండ, పొంగా బుజ్జి, మూగు రాజు, అంబటి చిన్న, గొరుసు దుర్గారావు, చొడుపిల్లి సతీష్, చింతపల్లి తాతారావు, కోడూరు కుమారస్వామి, లూటుకుర్తి మోహన్, అమలకంటి బలరాం, పాలిక నాని,సంఘాని నాగూర్, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, ఓలేటి పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ రికార్డు సాధించిన యోగసాధకులు తేజేశ్వరరావు

- అభినందించిన ప్రిన్సిపల్ డాక్టర్ నాయుడు



**కాకినాడ.పెన్ పవర్ మే 2 :** స్థానిక ఆదిత్య డిగ్రీ, పీ జీ కళాశాల తెలుగు విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్,యోగ సాధకులు టీ తేజేశ్వరరావును ఆదిత్య డిగ్రీ , పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు అభినందించారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రణవ సంకల్పయోగ సమితి శ్రీ పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహా సూర్యవందనం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కార్యక్రమం జరిగింది.108 సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తేజేశ్వరరావుకు వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ప్రశంసా పత్రాన్ని కాకినాడ కలెక్టర్ షాన్మోహన్ జిల్లా క్రీడా ప్రాంగణంలో అందించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ యోగా గురువు శ్రీ సచ్చిదానంద యోగి కి,నేషనల్ యోగా జడ్జి వీవీఎన్ మూర్తి,ఇండియన్ యోగా ఫెడరేషన్ రాష్ట్ర ఇన్చార్జి సత్యప్రియకు ధన్యవాదాలు తెలిపారు.వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ప్రశంస పత్రాన్ని అందుకున్న తేజేశ్వరరావును అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు,వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,క్యాంపస్ ఇన్చార్జి మూర్తి,తదితర అధ్యాపకులు అభినందించారు.

# కిశోరి వికాసం బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది



**సీతానగరం, పెన్ పవర్, మే 2:** కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఇందిరా భారతిఅన్నారు. శుక్రవారం సీతానగరం మండలంలోని బొబ్బిలంక సెక్టార్ కాటవరం గ్రామంలో మూడు అంగన్వాడి సెంటర్లను కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకోకూడదని చెప్పారు. 18ఏళ్లలోపు వివాహాలు చేస్తే పోలీస్ స్టేషన్లో గానీ, ఐసిడిఎస్ అధికారులకు గానీ సమాచారం అందించాలని సూచించారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్టు వివరించారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొనేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్క్రైమ్, ఆన్లైన్ వేదికలపై జాగ్రత్తగా వుండేలా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. బాలికలు అన్ని విధాలా ఎదగడానికి ఉన్న అడ్డంకులను తొలగించడంలో పటిష్ట భాగస్వామ్యం ఉండాలన్నారు. డ్రాపౌట్స్ తిరిగి చదువుకొనేలా ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు పెంచడం, రక్తహీనతను నివారించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, యోగా, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం తదితరాలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ నాగ దుర్గ, సచివాలయ మహిళా పోలీస్, సిహెచ్ పోశమ్మ, సిహెచ్ బేబీ, ఆర్. జ్యోతి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు,

# మెడికల్ వార్డుల్లో రోగుల రద్దీకి అనుగుణంగా మంచాల ఏర్పాటు

- అదనంగా జెరియాట్రిక్, హెమటాలాజీ సేవలు
- జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్



**కాకినాడ.పెన్ పవర్ మే 2 :** కాకినాడ ప్రభుత్వ సామాన్య సర్వజన ఆసుపత్రిలో అత్యంత ప్రధానమైన ప్రాముఖ్యత కలిగిన విభాగాల్లో ఒకటైన మెడికల్ వార్డులో రోగుల కష్టాలు గట్టెక్కనున్నాయి. ఆసుపత్రి సూపరింటేండెంట్ డాక్టర్ ఎమ్.పి.ఆర్ విఠల్ చొరవతో దాతలనుండి సేకరించిన మంచాలు, ఆసుపత్రిలో రోగుల సంఖ్య తక్కువగా ఉన్న వార్డుల్లో నుండి తీసుకువచ్చిన మంచాలను మెడికల్ వార్డులో ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ విఠల్ తెలిపారు. ఇప్పటి వరకు రోగుల తాకిడి అధికంగా ఉండడంతో మంచానికి ఇద్దరూ లేక ముగ్గుర్ని వేసి వైద్యసేవలు అందిస్తూ వైద్యులు నెట్టుకొచ్చారు.శుక్రవారం సూపరింటేండెంట్ రౌండ్స్ నేపథ్యంలో జనరల్ మెడిసిన్ వార్డులు, ఓల్డ్ ఎస్.ఎస్.ఎల్.ఆర్ వార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ మెడికల్ వార్డుల్లో మంచాలు సమస్య అధికంగా ఉన్న కారణం మరికొన్ని మంచాలు ఇక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. డి ఎమ్ ఈ ఆదేశాల మేరకు మెడికల్ అన్ని యూనిట్లకు సంబందించి వరండాల్లో వయోవృద్ధులకు ప్రత్యేక జరియాట్రిక్ విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మెడికల్ విభాగం పర్యవేక్షణలో కొనసాగే రక్తసంబందిత హెమటాలజీ విభాగానికి కూడా మంచాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇందుకు సంబంధించి మెడికల్ విభాగాదిపతి డాక్టర్ పి. యశోదమ్మ అభిప్రాయాలు సూచనలు చర్చించడం జరిగిందని ఆయన అన్నారు. క్రమబద్ధంగా ప్రాధాన్యతానుసారం ఆసుపత్రిలో మౌళిక సౌకర్యాలు కల్పించి రోగులకు మేలైన మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా, రోజు రోజుకు పెరుగుతున్న రోగుల రద్దీకి అనుగుణంగా వైద్య సేవలు అందించెందుకు సమిష్టి కృషి చేస్తున్నట్లు జిజిహెచ్ సుపరింటేండెంట్ డాక్టర్ ఎమ్.పి.ఆర్ విఠల్ పేర్కొన్నారు.

# పేకాట శిబిరం పై దాడి అయిదుగురు అరెస్ట్



**ఆత్రేయపురం పెన్ పవర్ మే 2:** ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి పాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం రావడంతో ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము తన సిబ్బందితో పేకాట శిబిరం పై దాడి చేయగా పేకాట ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుండి 22500/- రూపాయల నగదును స్వాధీనపరచుకొని వారి ఐదుగురు పై కేసు నమోదు చేసినట్లు ఆత్రేయపురం ఎస్ రాము తెలిపినారు.

# అడ్డకొండ భూమి నిరుపేదలకు దక్కేవరకు రాజీలేని పోరాటం

**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, మే 2:** మేడే వారోత్సవాల్లో భాగంగా గండెపల్లి మండలం కె.గోపాలపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎర్రజెండా నాయకత్వంలో అనేక తిరుగుబాట్లు జరిగాయని భూమి సమస్య ప్రతిపాదికన దున్నే వానికి భూమి అనే నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పీడిత ప్రజలకు పంచిన చరిత్ర ఎర్రజెండాదని ఆయన కొనియాడారు. కె.గోపాలపురం-మల్లిసాల గ్రామాల మధ్యలో ఉన్న సర్వే నెంబరు 353లో గల 508 ఎకరాల ప్రభుత్వ పోరంబోకైన అడ్డ కొండ భూమిని నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దశాబ్దాలుగా అనేక పోరాటాలు చేస్తూ కుట్ర కేసులు, దాడులను ఎదుర్కొంటున్న నేటికీ ఈ సమస్య పరిష్కారంలో అధికారులు పాలకులు చొరవ చూపకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణం నిరుపేదలకు పట్టాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి అధికారం చేపట్టాక దేశభక్తి ముసుగులో మెజార్టీ ప్రజలను రెచ్చగొట్టి మైనార్టీ, దళిత, గిరిజనులపై దాడులు చేయిస్తూ, అటవీ సంపదను, ఆదివాసులను కాపాడుతున్న ప్రజా ఉద్యమకారులపై ఉక్కు పాదం మోపుతూ ఆపరేషన్ కగార్ పేరుతో అడవుల్లో ఆదివాసులను ఊచకోత కోస్తూ అటవీ సంపదను కార్పొరేట్




కంపెనీలకు కట్టబెట్టే ఆలోచనను విరమించుకోవాలని అలాగే ఆపరేషన్ కగార్ ని నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు(వి)రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, ఎపి ఆర్ సి ఎస్ నాయకులు డి.సురేష్, గ్రామ నాయకులు వేమగిరి వెంకటేశులు, కోడి కృష్ణ, లాజరు,పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా గర్భిణీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి





**పెనుమంట్ర,పెన్ పవర్, మే-02:**వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా గర్భిణీలు అందుకు తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జి గీతా బాయ్ అన్నారు. శుక్రవారం ఆచంట మండలం వల్లూరు, ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆసు పత్రులలోని రికార్డులను, రూట్ మ్యాప్ ను, గర్భిణీ స్త్రీలను కొత్తగా నిర్మాణం చేపట్టిన బిల్డింగ్ పనులను, ఫార్మసీ తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి కొరత జల కాలుష్యంతో డయేరియా, వడదెబ్బ ఇతర సమస్యలు చుట్టుముట్టి అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఓ ఆర్ యస్ ప్యాకెట్లు సెలైన్ బాటిల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎండలో పనిచేయడం వల్ల పొటాషియం, సోడియం వంటివి చెమట రూపంలో బయటకు వెళ్లిపోయే ప్రమాదం ఉందని దీని ద్వారా అస్వస్థకు గురయ్య ప్రమాదం ఉందన్నారు. అందువల్ల తరచూ మంచినీళ్లు, లేదా గ్లూకోజ్ ఇతర లవణా ద్రావణాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. చెమట అధికంగా పట్టి అస్వస్థకు గురయ్యే లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న వైద్యాధికారులను సంప్రదించాలని ఆమె కోరారు. వేసవిలో గర్భిణీలు తగ్గు జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. స్వచ్ఛమైన నీరు మజ్జిగ కొబ్బరి నీళ్ళు తో పాటు పండ్లు రసాలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కలిపిన నీరు గ్లూకోజ్ త్రాగాలన్నారు. ఎండ బారిన పడితే శరీరము వేడెక్కి వాంతులు విరోచనాలు అవుతాయని కళ్ళు తిరిగే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. పూజ, డా. వేణుబాబు, డా. హైందవి, ఎం పి హెచ్ ఈ ఓ శివకుమార్, హెచ్ వి వసంతకుమారి, మరియు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ వత్తిడి వల్లే కుల గణన.
# కామన ప్రభాకరరావు.



**మండపేట. పెన్ పవర్.మే 2 :**దేశంలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు స్పందించారు. ఇది లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ వత్తిడి వల్లే ప్రభుత్వం దిగివచ్చి ప్రకటన విడుదల చేసినట్లు కామన తెలిపారు. దాదాపు గా ప్రతి నిత్యం రాహుల్ గాంధీ కులగణన పై పోరాడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రం లక్ష్యపెట్టకపోవడం తో కాంగ్రెస్ పార్టీ అధికారం లో ఉన్న రాష్ట్రంలలో తెలంగాణ, కర్ణాటక లలో కులగణన చేపట్టడం తో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. దీంతో జనగణన తో పాటు కులగణ న చేపడతామని ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఆఖరు నాటికి దేశం లోని కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన చేస్తున్నట్లు కామన ప్రభాకరరావు పేర్కొన్నారు. కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియ జేయాలని కామన ప్రశ్నించారు. దేశం లో ఏయే కులాలు ఎంత మంది ఉన్నారో ఈ లెక్కల ద్వారా తెలుస్తాయనీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ దేశ ప్రజల భవిష్యతు ఆలోచన చేస్తుందన్నారు.

# డీసీసీబీ చైర్మన్ గా మర్రెడ్డి.
# విశ్వసనీయత కు దక్కిన చోటు.

- ద్వార పూడి సర్పంచ్ గా విశేష సేవలు.
- పవన్ కు అత్యంత సన్నిహితులు.



**మండపేట. పెన్ పవర్.మే 2 ::**మండపేట నియోజక వర్గం ద్వార పూడి కి చెందిన మర్రెడ్డి శ్రీనివాసరావు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీసీసీబీ ఛైర్మెన్ గా ప్రభుత్వం నియమించినట్లు తెలుస్తుంది. అధికార ప్రకటన వెలువడాల్సి ఉంది.
ఈయన ప్రస్తుతం పిఠాపురం, అనపర్తి నియోజక వర్గాలు జన సేన ఇన్ ఛార్జ్ గా వ్యవహరిస్తున్నారు.మృదు స్వభావి అయిన శ్రీనివాస్ గత కాంగ్రెస్ హయాంలో ద్వార పూడి సర్పంచ్ గా పనిచేశారు. వృత్తి పరంగా చార్టెడ్ అకౌంటెంట్ అయిన అయిన రాజకీయాల్లో రావడమే సర్పంచ్ గా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధి కి నితినిజయితీ లతో పనిచేశారు. ప్రజారాజ్యం పార్టీ లో కీలక పాత్ర పోషించారు. మెగాస్టార్ చిరంజీవి, నాగేంద్ర బాబు, పవన్ కళ్యాణ్ లకు ఆయన అత్యంత సన్నిహితుడు. నాగేంద్ర బాబు భార్య కు దగ్గరి బంధువు. దీంతో జన సేన లో ఆయన కు తొలి నుండి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. పిఠాపురం ఎన్నికల్లో అన్ని తానై పవన్ విజయానికి తెర వెనుక కీలక పాత్ర పోషించారు. ఎన్నికల తరువాత ఆ నియోజక వర్గ జన సేన ఇన్ ఛార్జ్ గా అన్ని తానై అక్కడ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యంత ప్రతిష్టాత్మక మైన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి ఆయన్ను వరించింది. మండపేట నియోజక వర్గం కు చెందిన శ్రీనివాస్ ఎంపిక కావడం తో నియోజకవర్గం లో హర్షం వ్యక్తమవుతోంది. విశ్వసనీయత కు మారు పేరైన శ్రీనివాస్ ను పలువురు అభినందించారు.

# నూతన వితంతు పెన్షన్లు పంపిణీ చేసిన కూటమి నాయకులు



**గోకవరం, పెన్ పవర్, ఏఫ్రియల్ 02 :** రాష్ట్రంలో అమలవుతున్నటువంటి పెన్షన్ విధానం ప్రజల మన్నలను పొందిందని,ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శమని గోకవరం మండల టిడిపి కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ అన్నారు. పెన్షన్ పొందుతున్నటువంటి భర్త చనిపోతే అతని యొక్క పెన్షన్ వితంతు పెన్షన్ గా మార్పు చేసి మరుసటి నెలలోనే వితంతువుకు అందజేసే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న విధానం అభినందనీయం అని రామకృష్ణ అన్నారు. శుక్రవారం గోకవరం గ్రామ పంచాయతీ సెక్రెటరీ శిరీష ఆధ్వర్యంలో కూటమి నాయకుల చేతుల మీదుగా
కర్రి రాజేశ్వరి, శీర్ల అనసూయ చింతాటి శకుంతల, మచ్చా వెంకటలక్ష్మిలకు పెన్షన్లులను అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ 200 రూపాయలుగా ఉన్నటువంటి పెన్షన్ 1000 రూపాయలుగా పెంచి, ఆ వెయ్యి రూపాయలను 2000 రూపాయలుగా పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెన్షన్ దారులు దగాపడ్డారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూపర్ సిక్స్ లో భాగంగా 3000 రూపాయలను ఒకేసారి 4000 రూపాయలుగా పెంచి పెన్షన్ దారుల కళ్ళల్లో ఆనందం చూడడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, మాజీ జడ్పిటిసి పాలూరి బోసు బాబు, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు బత్తుల సత్తిబాబు,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గునిపే భరత్, మాజీ ఎంపీటీసీ పులపర్తి బుజ్జి, బిజెపి మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, టిడిపి టౌన్ కన్వీనర్ పోసిన ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షులు గుండా శివప్రసాద్, గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, టీడీపి నాయకులు పాలాడి శ్రీనివాసరావు, బిజెపి నాయకులు బత్తుల నానాజీ, టీడీపి యూనిట్ ఇంచార్జ్ చీకట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవులకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇవ్వండి



జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు

**జగ్గంపేట, పెన్ పవర్, మే 2:** వేసవి సెలవులకు ఊరెళ్లే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు తెలిపారు. ఊరెళ్లే సమయంలో ఇంట్లో విలువైన బంగారు, వెండి ఇతర వస్తువులు ఉంచరాదన్నారు. లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. ఊరెళ్లే విషయం పోలీసులకు తెలిపితే రాత్రి సమయాల్లో ఆ ఇంటి పరిసరాల్లో గస్తీ పెంచుతామన్నారు. ఇప్పటికే రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ పెంచామని ఎక్కడా చోరీలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగ్గంపేటలో ముఖ్యకూడళ్లల్లో సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశామన్నారు. అలాగే డ్రోన్ కెమెరాతో ఎప్పటికప్పుడు అనుమానిత ప్రాంతాలను జల్లెడ పడుతున్నామన్నారు. దీనిపై గ్రామాల్లో ఆటోపై ప్రచారం కల్పిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ముగ్గురు బైక్ పై వెళ్లరాదని, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని ఎస్ఐ రఘునాధరావు సూచించారు.

# రికార్డ్ అసిస్టెంట్ ను సన్మానించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



**అల్లవరం, పెన్ పవర్ మే 02:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామంలో గోడి గ్రంథాలయ శాఖలో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేసి పదవీ విరమణ పొందిన శ్రీ పడమటి సత్యనారాయణ ఘనంగా సన్మానించిన ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు శ్రీ బొమ్మి ఇజ్రాయిల్. అల్లవరం మండలం గోడి గ్రామంలో గోడి శాఖ గ్రంథాలయంలో గతి 20 సంవత్సరాలుగా విశేష సేవలు అందించి గ్రంథాలయ అభివృద్ధికి దోహదపడి ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందిన పడమటి సత్యనారాయణ శ్రీమతి విజయలక్ష్మి దంపతులను దుస్సాలువాతో, చిరుజ్ఞాపికతో సన్మానించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి సత్యనారాయణ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు సూర్యనారాయణరాజు ( సూరిబాబు), గజపతి వర్మ (చిన్న వర్మ) ఉద్యోగస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కిషోర్ వికాసం వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**జగ్గంపేట, పెన్ పవర్, మే 2:** జగ్గంపేటలోని వెలుగు సమైక్య కార్యాలయ ఆవరణలో శుక్రవారం సిడిపిఓ పూర్ణిమ అధ్యక్షతన కిషోర్ వికాసం వేసవి శిబిరాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్ వి వి సత్యనారాయణ, పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ కౌమార బాలికల సమస్యలు, పోషన్ అవసరాలు, పిల్లల సంరక్షణ, చిన్నపిల్లల అక్రమ రవాణా, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అదే విధంగా బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ మొదలైన అంశాలను వివరించారు. నెలరోజుల పాటు జరిగే ఈ వేసవి శిబిరం ద్వారా నేర్చుకున్న అంశాలు మీ భావి జీవితంలో ప్రతి అడుగులోను నెమరు వేసుకొంటూ ఆత్మస్థైర్యంతో ముందడుగు వెయ్యాలన్నారు. అనంతరం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు మాట్లాడుతూ గ్రామస్థాయిలో మహిళా పోలీసులు కీలకపాత్ర వహించి ఈ వేసవి శిబిరంలో కిశోరి బాలికలకు ట్రైన్ చేసి చదువు వైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాసరావు, జగ్గంపేట ఎస్సై రఘునాధరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, డీసీపీఓ వెంకట్రావు, మహిళ పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచరు, వివో ఏలు, కిశోరి బాలికలు సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.



# కూటమి హయాంలో పించన్లు రద్దు.తోట త్రిమూర్తులు.




**మండపేట. పెన్ పవర్. మే 2 :**కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల పెన్షన్లను రద్దు చేసిందని మండపేట నియోజక వర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. గత ఎన్నికల ముందు అర్హులుగా గుర్తించిన వారి పెన్షన్ల విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు.వైఎస్ జగన్ హయాంలో ప్రతి ఏటా రూ.32 వేల కోట్లు పెన్షన్ల కోసం బడ్జెట్‌లో కేటాయించగా, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని ఆయన ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శలు చేశారు. పూర్తిస్థాయిలో పెన్షన్ల ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో కులం, మతం, పార్టీలకు అతీతంగా పేదరికాన్ని మాత్రమే కొలమానంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందించామని పేర్కొన్నారు. 2019-2024 మధ్య 65 లక్షల పెన్షన్లు పంపిణీ చేసిన ఘనత వైఎస్ఆర్‌సీపీకి దక్కుతుందని తోట పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల టీడీఎల్పీ సమావేశంలో వైఎస్ఆర్‌సీపీకి చెందిన వారికి ఎలాంటి సాయం చేయొద్దు అని చేసిన వ్యాఖ్యలను త్రిమూర్తులు తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విఘాతమని పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల పెన్షన్లను రాజకీయ కక్షతో రద్దు చేస్తున్నారని ఆరోపించారు. వికలాంగులకు రీ-వెరిఫికేషన్ పేరుతో తిరిగి సర్వే చేయడం వల్ల వారిలో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. గ్రామాల్లో వైఎస్ఆర్ అయితే తీసేయండి అంటూ ప్రచారం జరుగుతోందని ఆయన గుర్తు చేశారు.పేదరికమే కొలమానంగా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా నిరుపేదలకు న్యాయం చేయాలన్నారు.

# అమరావతిలో ప్రధాని సభకు తరలి వెళ్లిన ఎన్డీఏ కూటమి శ్రేణులు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 2:** అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి శుక్రవారం విచ్చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ సభకు ఏలేశ్వరం మండలం నుంచి ఎన్డీఏ కూటమి శ్రేణులు శుక్రవారం ఉదయం తరలి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి పునర్నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. దీంట్లో వివిధ శాఖల అధికారులు, ఎన్డీఏ ఓటమి నాయకులను భాగస్వామ్యం చేస్తూ భారీ ఎత్తున సభ నిర్వహించాలని తలపెట్టింది. దీనిలో భాగంగానే ఏలేశ్వరం మండలం నుంచి ప్రైవేట్ బస్సుల్లో స్థానిక ఎన్డీఏ శ్రేణుల ఆధ్వర్యంలో జనాలు సభకు భారీగా తరలి వెళ్లారు. ఏలేశ్వరం పట్టణ టిడిపి నాయకులు మూది నారాయణస్వామి, బదిరెడ్డి గోపి లు అమరావతి వెళ్లే వాహనాలకు పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. అలాగే మండలంలో వివిధ గ్రామాల నుంచి స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలను బస్సుల్లో అమరావతి సభకు తరలించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక నాయకులతోపాటు వివిధ శాఖల అధికారులు సహకరించారు.

# లాభసాటి ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు భాగస్వాములు కావాలి.






**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 2:** లాభసటిగా మారిన ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు భాగస్వాములు కావాలి అని ప్రగతిపాడు నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు యాళ్ళ జగదీష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దనాపల్లి గ్రామంలో రైతు సాధికార సంస్థ చేపట్టిన కె ఏ పి-2025 అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగదీష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అధునాతన పద్ధతుల ద్వారా రైతులు ఎక్కువ లాభాలు సాధించవచ్చు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం అన్ని విధాల రైతులకు పలు ప్రోత్సాహాలనిస్తూ, ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేయబడిన పలు ప్రకృతివ్యవసాయం లో ఉపయోగించే వ్యవసాయ పద్ధతులను, శుద్ధి చేయబడిన విత్తనాలను ఏ శాతం లో, ఏ కాలాల్లో పంటలు వేసుకోవాలి అనే దానిపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ ఎం పి టి సి జ్యోతుల పెదబాబు, ఎన్డీఏ కూటమి నాయకులు బసా ప్రసాద్, పలివెల శ్రీనివాస్ పెంటకోట మోహన్, లక్ష్మణరావు, పెంట కోట శ్రీధర్, రైతులు, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏవోగా పదోన్నతి పొందిన చౌదరి



**గోపాలపురం, పెన్ పవర్, మే 2.** తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా గోపాలపురం గ్రామానికి చెందిన వల్లభనేని వెంకట సత్యనారాయణ చౌదరి పదోన్నతి పై నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ గంట పద్మశ్రీ చేతులు మీదుగా శుక్రవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. చౌదరి గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయం లో పనిచేశారు, అలాగే జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం పంచాయతీ రాజ్ కార్యాలయాల్లో సైతం సీనియర్ అసిస్టెంట్ గా పని చేశారు. అక్కడనుండి పదోన్నతి పై కొవ్వూరు రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఇదిలా ఉంటే స్థానికంగా చౌదరి పేరుతో సుపరిచితులైన వెంకట సత్యనారాయణ కు పదోన్నతి రావడంతో స్నేహితులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# కార్మికుల నేస్తం.. మన మంత్రి సుభాష్ అన్న ఆడియో సాంగ్ విడుదల

**కె గంగవరం పెన్ పవర్ మే 2 :** మన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పలు విధాలుగా ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. రామచంద్రపురానికి చెందిన ఓ అభిమాని ఐతే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం -మే డే ను పురస్కరించుకొని మంత్రి సుభాష్ యొక్క గొప్పతనాన్ని, సేవాభావాన్ని వర్ణిస్తూ ఒక పాటను రాసి, తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఎంతో అభిమానంతో చేసిన ఆ వీడియో సాంగ్ ప్రస్తుతం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.ఆ సీడీ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం సిడి తయారు చేసిన అభిమాని, కూటమి పార్టీ నాయకుల సమక్షంలో శుక్రవారం ఆవిష్కరించారు."కార్మికుల నేస్తం మన మంత్రి సుభాష్ అన్న కర్షకుల దోస్తీ మన మంత్రి సుభాష్ అన్న కష్టజీవి శ్రమ విలువ తెలిసిన వాడు.చంద్రబాబు ఆశయాలు..పవన్ అన్న ఆవేశం.. లోకేష్ అన్న అడుగుజాడలు కలబోసి..రాష్ట్ర పునర్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న నా కార్మిక సోదరులకు మే డే శుభాకాంక్షలు అంటూ"..సాగిన ఈ పాట ఆధ్యాంతం వినసొంపుగా, అర్థవంతంగా ఉంది అంటూ కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంతో పాటు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రచయితను అభినందించారు.రామచంద్రపురం నియోజవర్గంలో ప్రతి కార్మిక సంఘాల్లోనూ ఈ పాట మంచి పాపులర్ అవటం గమనార్హం.



మంత్రి సుభాష్ ప్రజలందరితో మమేకమవుతూ..ఓ కుటుంబ సభ్యుడిగా..రక్తసంబంధీకుడిలా వ్యవహరిస్తూ తనదైన శైలిలో ముందుకు సాగిపోతున్నారు. మంత్రి సుభాష్ మానవత్వానికి.. సహాయ గుణానికి.. ప్రేమ, కనికరానికి.. కేరాఫ్ అడ్రస్ లా మారిపోయారని పలువురు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

# ఎమ్మెల్యే ముప్పిడిని పరామర్శించిన జనసేన నేతలు

**గోపాలపురం, పెన్ పవర్, మే 2.** కొవ్వూరు, దేవరపల్లి లకు చెందిన జనసేన నాయకులు గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్ దొడ్డి గర్ల సువర్ణ రాజు ఆధ్వర్యంలో కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావును శుక్రవారం. గత టిడిపి హయంలో గోపాలపురం శాసనసభ్యులుగా కూడా పనిచేసిన వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. కొద్ది రోజులు విజయవాడ ఆస్పత్రిలో వైద్యం పొందారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగ్గా ఉండడంతో దేవరపల్లిలో ఆయన గృహంలో ఉన్నారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు వెంకేశ్వరరావును కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి పార్టీ అధ్యక్షులు



కాట్నం గణేష్, నాయకులు పసుపులేటి ప్రసాద్, కంబాల సత్తిబాబు, మాధవరం వెంకటేశ్వరరావు, ఆకుల నాని, పోతుల దుర్గాప్రసాద్, అచ్యుతరాయుడు, పసలపూడి పండు తదితరులు పాల్గొన్నారు.

# మన్యం బంద్ మండలంలో పాక్షికం





**వై రామవరం, పెన్ పవర్,మే 2 :** జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన మన్యం బంద్ పాక్షికంగా జరిగింది.

గిరిజన సంఘం మండల కార్యదర్శి కే.శాంతిరాజ ఆధ్వర్యంలో వై.రామవరం మండలంలో మన్యం బంధు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండలంలో ఉన్న వ్యాపార సంస్థలు పాక్షికంగా మూసివేశారు. ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు పాక్షికంగా రద్దయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు యధావిధిగా పని చేశాయి. గిరిజన సంఘం నాయకులు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బందుకు సహకరించిన వ్యాపారస్తులు అందరికీ గిరిజన సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు గడుతూరి మల్లికార్జునరావు, పల్లాల లక్ష్మణ్ రెడ్డి, పల్లాల చంద్రబోస్, రోల్ పల్లి కొండబాబు, ముర్ల కృష్ణారెడ్డి, గుడ్ల బాబు, పొలాల కృష్ణారెడ్డి పలువురు నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు రూపుమాపాలి- సిడిపిఓ నాగలక్ష్మి.



**గోపాలపురం, పెన్ పవర్,మే2.** బాల్య వివాహాలను రూపుమాపడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనిగోపాలపురం ఐసిడిఎస్ సిడిపిఓ కె నాగలక్ష్మి తెలిపారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిడిపిఓ నాగలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాల రహిత జిల్లాగా రూపొందించాలని అన్నారు. బాల్యవివాహాలు ప్రోత్సహించిన, పెళ్లిళ్లు చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్న వయసులోనేవివాహా లు చేసుకోవడం వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడతారన్నారు. బాల్య వివాహాలను అందరూ ఐక్యమత్యంతో ఎదుర్కోన వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.లేనిపక్షంలో వారు విద్యా, ఆరోగ్యం నైతిక విలువలను కోల్పోతారని అన్నారు.అంగన్వాడి వర్కర్స్ బడి ఈడు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని,నాగలక్ష్మి సూచించారు. అనంతరంకిశోర వికాసం పై వేసవి శిక్షణ కార్యక్రమం



నిర్వహించారు. 11 సంవత్సరాల నుండి, 18 సంవత్సరములులోపు బాలికలకు మే నెల రెండవ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు ప్రతి మంగళవారం, శుక్రవారంలో గ్రామస్థాయి సంఘాలు ఏర్పాటు చేసి, నిర్మూలన, పోషకాహార లోపం, బాలికల్లో రక్తహీనత పై, రుగ్మతలపై, కెరియర్స్ గైడెన్స్, స్కిల్ డెవలప్మెంట్, దిశా చట్టంపై, పలుఅంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్వైజర్, జేవీ వెంకటరమణ, కె విజయ కుమారి, ఏఎన్ఎం, సచివాలయ మహిళ పోలీస్, వివో లు ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు మోతాదును పున పరిశీలన చేయాలి : డాక్టర్ పి వి సత్యనారాయణ





**పెనుమంత్ర, పెన్ పవర్, మే-02:**
వరి, మొక్కజొన్న లాంటి సాగులో ఎరువులు మోతాదును పున పరిశీలన చేయాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకులు డా.పి.వి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో రెండొవ రోజు జరిగిన "గోదావరి మండల పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశం" శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్న లాంటి పంటలలో ఎరువుల వినియోగం సిఫార్సుకంటే చాలా ఎక్కువగా ఉంటున్నదని అన్నారు. దానికి తగ్గట్టుగా దిగుబడిలో పెరుగుదల కూడా కనిపిస్తున్నది కావునా ప్రస్తుతం సిఫారసులో ఉన్న ఎరువుల మోతాదును పునఃపరిశీలన చేయవలసిన ఆవశ్యకత పంటల యాజమాన్యం మరియు మృత్తిక శాస్త్రవేత్తలపై ఉన్నదని తెలిపారు. వరి ప్రధానంగా ఉన్న ప్రాంతాలలో కోత తరువాత మిగిలిన దుబ్బులను తగలబెట్టడం జరుగుతున్నదని, దానిని తగ్గించడానికి, సులభంగా కుళ్ళిపోయి భూమిలో కలిసిపోయేలా చేయడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న యంత్రాలను గోదావరి మండలంలో పరిశీలించాలని ఆదేశించారు. మొక్కజొన్నలో అధిక మోతాదులో ఎరువులు వినియోగిస్తున్న దృష్ట్యా, మార్కెట్ లో ఉన్న అన్ని సంకర రకాలతో పాటూ పెద్దాపురం పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రూపొందించిన కొత్త వంగడాలను కూడా రసాయన ఎరువుల అవసరత కొరకు పరిశోధనలు చేపట్టవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. విస్తరణ సంచాలకులు దా.జి.శివనారాయణ మాట్లాడుతూ పరిశోధనా స్థానాలు మరియు విత్తనోత్పత్తి సంస్థ లపై భారం తగ్గించడానికి రైతు విత్తనోత్పత్తి దారులను గ్రామాలలో అభవృద్ధి చేయవలసిన అవసరం ఉన్నదని విస్తరణ కేంద్రాలను ఆదేశించారు.

తదుపరి వరి ఎగుమతిదారుల సంఘం అధ్యక్షులు బి.వి.కృష్ణా రావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో పండించే 127 లక్షల టన్నుల ధాన్యం నుండి సుమారు 80 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుంది. మన రాష్ట్ర అవసరాలకు సుమారు 50 లక్షల టన్నుల బియ్యం సరిపోతుంది, మిగిలిన 30 లక్షల టన్నుల బియ్యాన్ని బాసుమతియేతర రకాల కేటగిరీ కింద ఇతర దేశాలకు ఎగుమతి చేయటం వల్ల రైతులకు అధిక ఆదాయం తో పాటు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి మరింత మేలుజరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. తదుపరి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులు ఐదు బృందాలుగా ఏర్పడి వరి, అపరాలు, చెరకు, చిరుధాన్యాలు, యాంత్రీకరణలలో వచ్చే సంవత్సరానికి చేపట్టవలసిన పరిశోధన మరియు విస్తరణ ప్రణాళికను రూపొందించారు.

ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డా. టి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారులు ఎస్.మాధవరావు, వి.బోసు బాబు, శాస్త్రవేత్తలు మరియు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ ఏపీ ఉపాధ్యక్షునిగా గారపాటి



**ఆలమూరు, పెన్ పవర్,మే02:** నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామానికి చెందిన గారపాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. గారపాటి ని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఢిల్లీ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షునిగా ఆయన ఇటీవల కాలంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను గుర్తించి గారపాటి శ్రీనివాస్ ను నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ లేబర్ మరియు చైల్డ్ రైట్స్ విభాగంలో ఆయనను ఉపాధ్యక్షులు గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నేషనల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన శ్రీనివాస్ ను పలువురు అభినందించారు.

## 8న బార్ అసోసియేషన్ ఎన్నికలు

**పెద్దాపురం, పెన్ పవర్, మే 2 :** పెద్దాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసినట్లు ఎలక్షన్ ఆఫీసర్స్ సారా మురళీ శ్రీనివాస్, వందే విజయ రాజ్ కుమార్, డాక్టర్ కె.ఎస్.నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెల 3, 4, 5 తేదీలలో నామినేషన్ల దాఖలు, 6న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, 8వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేరోజు సాయంత్రం 4:30 గంటలకు ఓట్ల లెక్కింపు అనంతరం గెలుపొందిన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## వరికోత మిషన్ బోల్తా ..తప్పిన ప్రమాదం



**కాజులూరు, పెన్ పవర్,మే2:** మండలంలోని ఆర్యావటం గ్రామంలో శుక్రవారం వరికోత మిషన్ బోల్తా పడింది. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ ముందుగానే క్రిందికి దూకివేయటంతో తృటిలో ప్రమాదం తప్పింది.దాంతో డ్రైవర్ ప్రాణాలతో బయట పడ్డాడు. దగ్గరలో ఉన్న రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనకు సంభందించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల గ్రామాలలో దాళ్వా మాసూళ్ళ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. స్థానికంగా ఉన్న వరి కోత మిషన్లు సరిపోక పోవటంతో రైతులు కొందరు ఇతర ప్రాంతాల నుంచి వరికోత మిషన్లు రప్పించి పంట మాసూళ్ళు నిర్వహిస్తున్నారు. ఈ నేపద్యంలో శుక్రవారం రాజమహేంద్రవరంకు చెందిన ఎస్ సాయి తన వరికోత మిషన్ను ఆర్యావటం తీసుకువచ్చారు. ట్రాలీపై నుంచి కిందికి దించుతుండగా వరికోత మిషను అదుపుతప్పి ఒక్కసారిగా భోల్తా పడింది. మిషను పై ఉన్న డ్రైవరు గమనించి కిందికి దూకెయ్యటంతో స్వల్పగాయాలతో భయటపడ్డాడు.కాగా ఈ సంఘటనపై తమకు ఎటువంటి పిర్యాదు అందలేదని గొల్లపాలెం పోలీసులు తెలియజేశారు.

## ఉచిత వేసవి క్రీడా శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి...



**ఆలమూరు, పెన్ పవర్,మే 02:** వేసవికాలంలో నిర్వహిస్తున్న ఉచిత టైక్వాండో,బాక్సింగ్,ఆర్చరీ శిక్షణ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ గ్రాండ్ మాస్టర్ టీ అబ్బులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రీడా అధికార సంస్థ వారి ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుండి జూన్ 8వ తేదీ వరకూ మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్లో రైస్ మిల్లు వద్ద సీనియర్ కోచులతో టైక్వాండో, జూడో, ఆర్చరీ, బాక్సింగ్ క్రీడల ఉచిత వేసవి శిక్షణా తరగతులు ఉదయం,సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.చిన్నారుల ఆరోగ్యకి శారీరిక ఎదుగుదలకు మానసిక ఉల్లాసానికి ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి చిన్నారుల ఆరోగ్యానికి శారీరక ఉల్లాసానికి ఉపయోగపడే ఈ క్రీడలను సద్వినియోగంచేసుకోవాలని ఆయన కోరారు.ఈ శిక్షణలో పాల్గొనే క్రీడాకారులు 6 సంవత్సరాల వయసు నుండి 18 సంవత్సరాలు వయసు కలిగి ఉండాలన్నారు.ఆసక్తి కలిగినవారు 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు,3 ఆధార్ కార్డు జిరాక్స్ లతో కోచులను సంప్రదించాలన్నారు.ఈ నెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు ఉచిత ప్రవేశ దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న క్రీడాకారులందరికి ప్రభుత్వం గుర్తింపు పొందిన సర్టిఫికెట్, మెడల్,మెమొంటో లను అందజేస్తారని ఆయన తెలియజేశారు.

## ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా.



**ఆలమూరు, పెన్ పవర్,మే02** ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది.ఈ ఘటన మండలంలోని జొన్నాడ 216 (ఏ) నెంబర్ గల జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాలు ప్రకారం కొత్తపేట గ్రామానికి చెందిన ఒక రైతు ట్రాక్టర్ డ్రైవర్గా పనిచేస్తుంటాడు. గ్రామంలోని తన ట్రాక్టర్లో ధాన్యం లోడుతో రాయవరం రైస్ మిల్లుకు వెళుతున్నాడు. కాగా జొన్నాడ ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే సర్వీస్ రోడ్డుకు ఫ్లై ఓవర్ సిబ్బంది సరైన రీతిలో మరమ్మత్తులు చేయకపోవడంతో ట్రాక్టర్ ట్రాలీ పైకి లేచి బోల్తా పడింది. దీంతో ధాన్యం మొత్తం రహదారిపై పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జాం అయ్యింది. హైవే సిబ్బంది సహకారంతో ట్రాఫిక్ ను నియంత్రించి, సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి అపాయము జరగలేదు.

# ఏజెన్సీ ఆదివాసి నిరుద్యోగులకు 100శాతం రిజర్వేషన్ అమలు జరిగే వరకు పోరాటం ఆగదు





**చింతూరు, పెన్ పవర్, మే 2:** మెగా డీఎస్సీ కాదు ఏజెన్సీ నిరుద్యోగుల దగా డీఎస్సీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివాసి నిరుద్యోగులకు ఎన్నికల హామీ అమలు చేపట్టే వరకు పోరాటం ఆగదని ఏజెన్సీ మన్యం బంద్ సందర్భంగా గిరిజన ఆదివాసి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు, సంపూర్ణంగా బంధు నిర్వహించారు. ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు నిరుద్యోగులు రహదారిపై ఆందోళన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంలో ఆదివాసి ఓట్ల కోసం అధికారంలోకి వస్తే ఏజెన్సీ ఉపాధి ఉద్యోగ అవకాశాలను ఆదివాసీలకు 100శాతం రిజర్వేషన్ చట్టం చేస్తానని ఆదివాసి నిరుద్యోగులకు అండగా ఉంటానని బహిరంగంగా హామీ ఇచ్చి, రాష్ట్ర లో మెగా డీఎస్సీ పేరుతో ఆదివాసి ఉద్యోగాలను గిరిజనేతరులకు కట్టబెడుతున్నారని తక్షణమే ఏజెన్సీ జిల్లాల ఉపాధ్యాయ నియమకాన్ని నిలుపుదల చేసి ఏజెన్సీ ఆదివాసుల కోసం స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు, ఆదివాసి సంఘ నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసులు హక్కులు సాధించడం ఆదివాసులందరూ రాజకీయాలకు అతీతంగా పోరాటాలను ఉధృతం చేయాలని గ్రామ గ్రామాన యువత గ్రామ పెద్దలు కదిలి వచ్చి పోరాటాన్ని నిర్వహించి 100శాతం రిజర్వేషన్ సాధించేవరకు పోరాటాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ పోరాటానికి ఆదివాసి ఉపాధ్యాయులు సంపూర్ణ మద్దతు తెలియచేశారు. సిపిఎం పార్టీ చింతూరు మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ, ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు రాజ్యాంగబద్ధంగా హక్కులు

90శాతం ఆదివాసీల్లో ఉన్న ప్రాంతంలో వారికి అన్యాయం జరిగే చర్యలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని తక్షణమే ఉద్యోగ నియమకంపై ఆదివాసులకు స్పెషల్ డిఎస్సీ ప్రకటించాలని వారి చేసే పోరాటాలకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పేగా ఎంపీటీసీ సున్నం నాగరాజు, గిరిజన సంఘం నాయకులు కారం సుబ్బారావు, పాండు నాగార్జున, పోడియం లక్ష్మణ్, ఉద్యోగ సంఘాల నాయకులు పండా కృష్ణయ్య, బొగ్గా ముత్తయ్య, తుర్రం వెంకటయ్య, రవి, ఆదివాసి సంఘాల నాయకులు పోడియం లక్ష్మణ్ సోడే, ప్రసాద్, సోడి శేషు, పాండు సుబ్బారావు, కారం సుందరయ్య, తుర్రం రామకోటి తదితరులు పాల్గొన్నారు,

# ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు రైతన్నల కృతజ్ఞతలు



**ఆలమూరు, పెన్ పవర్, మే02:** రబీ ధాన్యం సేకరణ అంశంలోమండలానికి చెందిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించింది. శుక్రవారం ప్రభుత్వం మండలంలోని రైతుల నుంచి 23వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సివిల్ సప్లై శాఖను నిర్దేశించడంతో రైతన్నలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రబీ ధాన్యం సేకరణ అంశంలో కాకినాడ, తూర్పుగోదావరి తదితర జిల్లాల కన్నా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం తక్కువగా ఉండడంతో జిల్లాలో మొట్టమొదటగా ధాన్యం ఉత్పత్తి పూర్తయ్యే ఆలమూరు మండలంలో గత కొద్దికాలంగా సమస్యలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం నిర్దేశించిన 34 శాతం పూర్తి కావడంతో మిగిలిన రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఇబ్బందులు పడ్డారు. ఇదే అదునుగా భావించిన స్థానిక మిల్లర్లు మద్దతు ధర కన్నా రూ.100 నుంచి రూ.200 వరకూ తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతన్నలు లబోదిబోమన్నారు. సమస్యను ఆలమూరు మండల పర్యటనకు విచ్చేసిన శాసనసభ్యులు బండారు సత్యానందరావు దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆయన తక్షణమే స్పందించి కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తోపాటు సివిల్ సప్లై ఎండీ మనజీర్ జిలానీ సమూన్ తదితర అధికారులతో సైతం మాట్లాడారు. అమరావతి పునర్నిర్మాణ సభ కోసం రాజధానికి వెళ్లిన ఆయన అక్కడ మంత్రి అచ్చెన్నాయుడును కలుసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే బండారు కృషితో ప్రభుత్వ అధికారులు వేగంగా స్పందించారు. తక్షణమే 23 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుంచి సివిల్ సప్లై శాఖ కొనుగోలు చేయాలని శుక్రవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దానితో మండల వ్యాప్తంగా రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం సేకరణలో ఏర్పడిన సమస్యను వెంటనే ఉన్నతాధికారులు, మంత్రి వద్దకు తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి ఎంతగానో కృషిచేసిన శాసనసభ్యులు బండారు సత్యానందరావుకు వారు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# కిశోర వికాసం శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి





**ఆలమూరు, పెన్ పవర్,మే 02:** ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా అమలు చేస్తున్న కిషోర బాలికా వికాసం 2 వేసవి శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూపర్వైజర్ ఎన్ నాగలక్ష్మి అన్నారు.ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన ఆలమూరులో గ్రామ సచివాలయం వద్ద కిషోర్ వికాసం వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించి,గ్రామ కమిటీల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఎన్ లావణ్య కుమార్ రాజా, టిడిపి నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్,సలాది నాగేశ్వరరావు,ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు పాల్గొని కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ రాజు పాల్గొని మాట్లాడారు. నేటి నుండి జూన్ 10 వరకు మండలంలో ఆయా సచివాలయాల పరిధిలో ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. 15 నుంచి 18 సంవత్సరాలు కిషోర బాలికలను గుర్తించి ఐదు నుండి 20 మంది పిల్లల వరకు ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వాళ్లకు ప్రతి మంగళ, శుక్ర వారాలలో సమావేశం ఏర్పాటు చేసి మహిళా అక్రమ రవాణా, ఆరోగ్య సమస్యలు నివారణ, బాల్య వివాహాలు వల్ల నష్టాలు, రక్తహీనతకు తీసుకోవలసిన జాగ్రత్తలు, నెలసరి సమయంలో పాటించవలసిన వ్యక్తిగత పరిశుభ్రత, తీసుకోవలసిన పోషకాహారం తదితర విషయాలపై గ్రామంలో ఉన్న మహిళా పోలీస్, ఏఎన్ఎం, ఆశ, అంగనవాడి టీచర్, విఒఎల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ప్రతినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం,ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, మహిళా పోలీసులు, వివోఏలు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి





**ఆలమూరు, పెన్ పవర్,మే02:** సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్ల పీహెచ్సీ వైద్యులు డాక్టర్ డి సాయి కిషోర్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పెదపల్ల పీహెచ్సీ నందు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ఏఎన్ఎం,ఆశ వర్కర్లకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ఏ రాజు పాల్గొని పలు అంశాలను వివరించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.ఈ వ్యాధి లక్షణాలు, సికెల్ సెల్ ఎనీమియాకు సంబంధించిన పరీక్షలు, సికెల్ సెల్ ఎనిమియా చికిత్స మొదలగు అంశాలను వివరించారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందని, ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో మారి రక్తనాళాలలో ప్రయాణం చేయలేక శరీరంలో నొప్పులు ఎక్కువ అవుతాయన్నారు.వ్యాధి లక్షణాలు ఉన్నవారు వైద్యులను సంప్రదించాలని కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాజాఅక్కులు, సిహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ర్యాలి గ్రామ మాజీ సర్పంచ్ జన్మదిన వేడుకలు ఘనంగా



**ఆత్రేయపురం పెన్ పవర్ మే 2:** మండలంలో ర్యాలి గ్రామ టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ పేరిచర్ల పుల్లంరాజు వర్మ జన్మదిన వేడుకలు శుక్రవారం నరసింహారాజు గెస్ట్ హౌస్ వద్ద ఘనంగా నిర్వహించారు. ర్యాలి గ్రామ టిడిపి అధ్యక్షులు మెర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జనసేన గ్రామ అధ్యక్షులు బందెల గురయ్య, , పాల్గొన్నారు.అనంతరం మెర్ల నాగేశ్వరావు,భారీ కేకు ను కట్ చేసి కార్యకర్తలు కు తినిపించారు. ఈ కార్యక్రమం లో బూత్ నంబర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మండలంలో అఘోరాలు హల్చల్





**వై రామవరం, పెన్ పవర్,ఏప్రిల్ 2 :** మండల కేంద్రమైన వైరామవరంలో శుక్రవారం మధ్యాహ్నం అఘోరాలు హల్చల్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం అఘోరాలు సడన్ గా మండల కేంద్రంలో దర్శనం ఇవ్వడంతో పలువురు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఆదివాసి సంఘం ఆధ్వర్యంలో మన్యం బంద్ జరగడంతో వ్యాపారస్తులు షాపులను మూసివేయడం జరిగింది. తెరిచి ఉన్న కొన్ని షాపులలో దర్జాగా మామూళ్లను పట్టుకుని పోయారు. అఘోరాలు హిందీ మాట్లాడుతున్నారని, ఇంగ్లీషులో అడిగిన సమాధానం చెప్పడం లేదని స్థానికులు తెలిపారు.భద్రాచలం వెళ్ళవలసిన ఘోరాలు రూట్ తప్పిపోవడంతో వై. రామవరం చేరినట్లు తెలిసింది. వై రామవరం మీదుగా భద్రాచలం కు రహదారి ఉందా అని అడగడం జరిగిందని స్థానికులు తెలిపారు. టాటా సుమో వాహనంలో వచ్చిన ఘోరాలు వెంటనే వెనుక తిరిగి పోయారని స్థానికులు తెలిపారు.

## గొల్లపాలెంలో కిశోరి వికాసం కార్యక్రమం!



**కాజులూరు, పెన్ పెవర్,మే2:** మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో సీడీపీవో ఆదేశాలమేరకు సూపర్వైజర్ ఎస్బి మాణిక్యాంబ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని కిశోర బాలికలకు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించినట్లు సూపర్ వైజర్ వివరించారు.పలు సామాజిక అంశాలపై విద్య,వైద్యం,క్రీడ,చట్టాల పై అవగాహన కల్పిస్తూ బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం అన్నారు.తాళ్లరేవు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మే2 నుంచి 10వ తేదీవరకు విసేవి శిక్షణా కార్య క్రమాలు జరగనున్నాయని సూపర్వైజర్ మాణిక్యాంబ పేర్కొన్నారు.గ్రామ స్థాయిలో కిషోర వికాసం కోసం గ్రామ వార్డు,స్థాయిల్లో మహిళా రక్షణ కార్యదర్శి (ఎంఎస్ కే) కన్వీనర్గా ఐదుగురితో ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయడం జరుగు తుందన్నారు.బాల్యవివాహాల నిర్మూలనపై బాలికల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.కిశోరి వికాసం వేసవి శిబిరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.సమాజంలో బాలికలు ఎలా నడుచుకోవాలో వారికి అర్థమయ్యే రీతిలో తెలియ జెప్పడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యం.ఈకార్యక్రమం లో స్థానిక ప్రజా ప్రతినిధులు,గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి కవులూరి రవి ప్రసాద్,మహిళా సంరక్షణ కార్యదర్శి పి. భాగ్యశ్రీ, కమిటీ సభ్యులు, అంగన్వాడీ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, బాలికలు,తదితరులు పాల్గొన్నారు.

## ఏపీయూడబ్ల్యూజే జిల్లా మహాసభను జయప్రదం చేయాలి



**పెద్దాపురం, పెన్ పవర్, మే 2:** కాకినాడ జేఎన్టీయూలో ఈనెల 4న నిర్వహించే ఏపీయూడబ్ల్యూజే జిల్లా మహాసభను జయప్రదం చేద్దామని ఐజేయు సభ్యులు రాకుర్తి రాంబాబు, సీనియర్ జర్నలిస్ట్ అడపా వెంకటరావు అన్నారు. యూనియన్ పెద్దాపురం నియోజకవర్గ అధ్యక్షుడు పెమ్మాడి వీరభద్రవర్మ అధ్యక్షతన స్థానిక మరిడమ్మ అమ్మవారి కాలక్షేప మండపంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఏపీయూడబ్ల్యూజే కృషి ఎనలేనిదన్నారు. జిల్లా మహాసభను జయప్రదం చేసేందుకు ప్రతీ ఒక్క సభ్యుడు సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎలిసెట్టి సత్యనారాయణ, ఎన్.పి.ఎస్. వినాయక్, పి. విజయ్, ఎన్. శ్రీరామ్, చవ్వాకుల ఈశ్వరరావు, ఉప్పలపాటి చంద్రదాస్, బిక్కిన వెంకట్, జి. సుబ్రహ్మణ్యం, ఏ. సురేంద్రనాథ్, పిఎస్ గంగాధరం, బొదిరెడ్డి బుజ్జిబాబు, ఆర్. వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కిశోర వికాసం శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి





**ఆలమూరు, పెన్ పవర్,మే 02:** ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా అమలు చేస్తున్న కిషోర బాలికా వికాసం 2 వేసవి శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూపర్వైజర్ ఎన్ నాగలక్ష్మి అన్నారు.ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన ఆలమూరులో గ్రామ సచివాలయం వద్ద కిషోర్ వికాసం వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించి,గ్రామ కమిటీల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఎన్ లావణ్య కుమార్ రాజా, టిడిపి నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్,సలాది నాగేశ్వరరావు,ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు పాల్గొని కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ రాజు పాల్గొని మాట్లాడారు. నేటి నుండి జూన్ 10 వరకు మండలంలో ఆయా సచివాలయాల పరిధిలో ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. 15 నుంచి 18 సంవత్సరాలు కిషోర బాలికలను గుర్తించి ఐదు నుండి 20 మంది పిల్లల వరకు ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వాళ్లకు ప్రతి మంగళ, శుక్ర వారాలలో సమావేశం ఏర్పాటు చేసి మహిళా అక్రమ రవాణా, ఆరోగ్య సమస్యలు నివారణ, బాల్య వివాహాలు వల్ల నష్టాలు, రక్తహీనతకు తీసుకోవలసిన జాగ్రత్తలు, నెలసరి సమయంలో పాటించవలసిన వ్యక్తిగత పరిశుభ్రత, తీసుకోవలసిన పోషకాహారం తదితర విషయాలపై గ్రామంలో ఉన్న మహిళా పోలీస్, ఏఎన్ఎం, ఆశ, అంగనవాడి టీచర్, విఒఎల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ప్రతినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం,ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, మహిళా పోలీసులు, వివోఏలు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి





**ఆలమూరు, పెన్ పవర్,మే02:** సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్ల పీహెచ్సీ వైద్యులు డాక్టర్ డి సాయి కిషోర్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పెదపల్ల పీహెచ్సీ నందు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ఏఎన్ఎం,ఆశ వర్కర్లకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ఏ రాజు పాల్గొని పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు, సికెల్ సెల్ ఎనీమియాకు సంబంధించిన పరీక్షలు, సికెల్ సెల్ ఎనిమియా చికిత్స మొదలగు అంశాలను వివరించారు. సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందని, ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో మారి రక్తనాళాలలో ప్రయాణం చేయలేక శరీరంలో నొప్పులు ఎక్కువ అవుతాయన్నారు.వ్యాధి లక్షణాలు ఉన్నవారు వైద్యులను సంప్రదించాలని కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాజాఅక్కులు, సిహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అద్వితీయుడు ఆది శంకరుడు



పెద్దాపురం, పెన్ పవర్, మే 2 : జగద్గురు ఆది శంకరాచార్యులు చూపిన ఆధ్యాత్మిక మార్గం సర్వమానవాళికి అనుసరణీయమని సనాతన ధర్మ గీతా ప్రచారకులు మల్లికార్జున స్వామి అన్నారు. పట్టణ పరిధిలోని స్థానిక సత్తిరెడ్డిపేటలో గల భగవద్గీత నిలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశంకరునికి ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం, భజ గోవింద స్తోత్రం ఆధ్యాత్మిక ప్రవచనం, తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సనాతన ధర్మ గీతా ప్రచారకులు మల్లికార్జున స్వామి ప్రసంగిస్తూ ఆది కవి వాల్మీకి రామాయణాన్ని రచించి, ఆదర్శ మానవుడు ఎలా ఉండాలో లోకానికి మార్గదర్శనం చేశాడని, వ్యాస మునీంద్రుడు మహా భారతం ద్వారా భారతీయ సంస్కృతిని భావి తరాలకు అందించాడని, శాఖోపశాఖలుగా చీలిపోయి అస్తవ్యస్తంగా ఉన్న హిందూ మతాన్నీ, వైదిక ధర్మాన్నీ ఆదిశంకరులు పునరుద్ధరించి ఒకే తాటిమీదకు తెచ్చి పునరుజ్జీవింపజేశారని అన్నారు. ఈవిధంగా వాల్మీకి, వ్యాసుల సరసన నిలువదగిన మహా పురుషుడు ఆది శంకరులని అన్నారు. ఎనిమిదేళ్ళ వయసులోనే ఆపత్సన్యాసం స్వీకరించి, తల్లి అనుజ్ఞతో శ్రీ శంకరులు దేశ సంచారం ప్రారంభించారన్నారు. పరివ్రాజకులై, నర్మదా నదీతీరంలో ఉన్న గోవింద భగవత్పాదాచార్యుల దగ్గర క్రమ సన్యాసం స్వీకరించి శ్రీ శంకర భగవత్పాదాచార్యులుగా యోగపట్టాన్ని స్వీకరించారని తెలిపారు. కర్మ లేనప్పుడు కర్మఫలం లేదని, కర్మఫలం లేకపోతే దేహం, దేహానికి సంబంధించిన దుఃఖాలూ లేవు' అనే మహోపదేశాన్ని ఆది శంకరాచార్య అందించారని ఆయన పేర్కొన్నారు. అనంతరం గుడివాడ అర్చకులు తుట్టగుంట సత్య సుదర్శనరావు, ఉండవల్లి సూరిబాబు, గోపు వీర్రాఘవలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గోలి వెంకట రామచంద్ర చౌదరి, ఉపాధ్యక్షులు నేతి వీరభద్రరావు, పోసిన రామకృష్ణ, కార్యదర్శి సత్యకుమార్, గంధం రామకృష్ణ, కూనంశెట్టి అర్జునుడు, బీజేపీ సామర్లకోట మండల అధ్యక్షుడు పెన్నాడ జగన్నాథం, గొర్రెల చిన్నారావు, గంద్రేటి త్రిమూర్తులు విజయనిర్మల, వీరలక్ష్మి, చంద్రావతి, కాంతి కుమారి, అంబిక శ్రీదేవి హర్షిత వేద కృష్ణదేవ మనోహర్, రామ్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ సన్నిధిలో వైభవంగా స్వర్ణ పుష్పార్చన



పెద్దాపురం, పెన్ పవర్, మే 2 : పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున నిత్య కైంకార్యాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గర్భగుడి నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్టింపచేసి వేదపండితుల పవిత్ర మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, దేవస్థానం సిబ్బంది రమణ, వేద పండితులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


# ఎమ్మెల్యే నల్లమిల్లి బాల్య స్నేహితుడు గొలుగూరి జన్మదిన వేడుకలు...



**అనపర్తి పెన్ పవర్ మే 2**

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాల్య స్నేహితుడు గొలుగూరి వీర రాఘవరెడ్డి జన్మదిన వేడుకలను తెలుగుదేశం బిజెపి జనసేన నేతలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అనపర్తి మండలం రామవరంలో రామకృష్ణారెడ్డి స్వగృహం నందు ఈ వేడుకలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి ముందుగా వీర రాఘవ రెడ్డికి శాలువా కప్పి అభిమానులు ఏర్పాటు చేసిన కేక ని కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి సత్యవతి వీర రాఘవరెడ్డిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జగ్గంపేట నుంచి భారీగా అమరావతికి తరలి వెళ్లిన కూటమి నాయకులు



**జగ్గంపేట (గండేపల్లి, పెన్ పవర్, మే 2:** అమరావతిలో రాజధాని పనుల పునః ప్రారంభం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొనే సభకు హాజరయ్యేందుకు జగ్గంపేట, గండేపల్లి మండలాల నుంచి భారీగా కూటమి నాయకులు తరలి వెళ్లారు. జగ్గంపేట నుంచి బయలుదేరిన బస్సులకు గండేపల్లిలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ లు అడబాల భాస్కరరావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, యల్లమిల్లి సీఎం అధిక సంఖ్యలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# తన మార్క్ అధికారులపై రేవంత్ గురి



**హైదరాబాద్, మే 2, పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచింది. ఈ తరుణంలో, పాలనలో సమర్థత, స్థిరత్వం సాధించేందుకు తన కార్యాలయం (సీఎంవో)ను పునర్వ్యవస్థీకరిస్తున్నారు. పదేళ్ల కేసీఆర్ పాలన తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్, ప్రభుత్వ యంత్రాంగంలో క్రమంగా మార్పులు చేస్తూ, తనదైన టీమ్‌ను రూపొందించుకుంటున్నారు. ఈ క్రమంలో సీఎంవోలో కీలక అధికారుల బదిలీలు, నియామకాలతో పాటు శాఖల పునర్విభజన చేపట్టారు.తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏఆడదిన్నర గడిచింది. 18 నెలల పాలనలో అధికారులపై ఇప్పటికీ పట్టు సాధించలేదు. అధికారుల నుంచి కూడా పెద్దగా సహకారం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈతరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి సీఎంవోలో సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఏప్రిల్ 27న 18 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఎంవో సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన సంగీత సత్యనారాయణను వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్‌గా, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా నియమించారు. ఆమె గతంలో వైద్యం, స్త్రీ–శిశు సంక్షేమం, ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖలను పర్యవేక్షించారు. అలాగే, పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌ను సీఎంవోలోకి తీసుకొచ్చి, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల అభివృద్ధి వంటి కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ చర్య రాష్ట్ర ఆర్థిక వృద్ధికి పెట్టుబడులను వేగవంతం చేయడానికి ఉద్దేశించినది.సీఎం కార్యదర్శిగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌గా నియమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆయన మూడు నెలల్లో రిటైర్ కానున్నారు. ప్రస్తుతం ఆయన అటవీ, వ్యవసాయం, పశుసంవర్ధక, రవాణా, పంచాయతీరాజ్ శాఖలను చూస్తున్నారు. షానవాజ్ ఖాసిమ్‌ను ఔషధ నియంత్రణ మండలి డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు. ఆసక్తికరంగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో జేఈవోగా సుదీర్ఘకాలం పనిచేసిన కేఎస్ శ్రీనివాసరాజును ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా నియమించారు. రిటైరైన ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు తమ పదవుల్లో కొనసాగుతారు. ఈ అధికారులు సీఎం సన్నిహిత బృందంగా కీలక శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ఈ మార్పులతో సీఎంవో సమర్థవంతమైన పాలనకు బలమైన పునాది వేస్తోందిరేవంత్ రెడ్డి సీఎంవో ప్రక్షాళన ద్వారా పాలనలో సమర్థత, పారదర్శకతను పెంచే దిశగా అడుగులు వేస్తున్నారు. కీలక బదిలీలు, అనుభవజ్ఞుల నియామకాలతో తెలంగాణ పాలన యంత్రాంగం మరింత బలపడనుంది.

## దెందులూరు నుంచి వేలాదిగా అమరావతికి తరలివెళ్లిన కూటమి శ్రేణులు, ప్రజలు

**దెందులూరు** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి పర్యటనకు దెందులూరు నియోజకవర్గం నుంచి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలి వెళ్లారు. హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి బస్సులకు జెండా ఊపి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ప్రజల కోసం గన్నవరం వద్ద గల ఎస్ఎం కన్వెన్షన్ హాల్లో భోజన సౌకర్యాలను కూడా ఏర్పాటుచేసారు.

నియోజకవర్గ పరిధిలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల నుంచి అమరావతి రాజధానికి కూటమి, నాయకులు, కార్యకర్తలు ప్రజలు వేలాదిగా తరలివెళ్లారు.

## ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలని ఏజెన్సీ బంద్

**ఏలూరు: పెన్ పవర్:** గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పలు గిరిజన సంఘాలు ఏజెన్సీ బంద్ కి పిలుపునిచ్చాయి. బంద్ లో భాగంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లీ ఇతర ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రశాంతంగా బంద్ కొనసాగింది. పలు వర్తక సంఘాలు తమ దుకాణాలను మూసివేసి స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నాయి.

## మండలి చైర్మన్ ను కలిసిన సీఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్: పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ రావు శుక్రవారం నాడు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ను జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి , తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా' నరసింహా చార్యులు, పాల్గొన్నారు .

## ఇంద్రకీలాద్రి లో వైభవంగా ఆదిశంకరాచార్య జయంతి

**విజయవాడ: పెన్ పవర్:**జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి ప్రత్యేక పూజలు, అభిషేకములు ఘనంగా జరిగాయి.ఆలయ స్థానాచార్య వి. శివ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు పూజా కార్యక్రమాలు మంత్రపూర్వకంగా నిర్వహించారు.

# సాకే శైలజకు కీలక బాధ్యతలు

**అనంతపురం మే 2, పెన్ పవర్:** అనంతపురం జిల్లాలో కీలక నియోజకవర్గంగా ఉన్న సింగనమలకు ఇన్చార్జిగా పిసిసి మాజీ అధ్యక్షుడు సాకే శైలజా నాథ్ ను నియమించారు. తద్వారా ఇక నుంచి రాజకీయంగా దూకుడు నిర్ణయాలు తీసుకుంటానని సంకేతాలు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేసిన శైలజానాథ్ ఇటీవల రాజీనామా చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి రాజకీయ దూకుడు కనబరుస్తున్నారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. అందుకు అనుగుణంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పార్టీకి పెద్ద నేతలు గుడ్ బై చెబుతున్నా.. జగన్మోహన్ రెడ్డి మాత్రం వెనక్కి తగ్గడం లేదు. నూతన నియామకాలతో దూకుడు తనాన్ని ప్రదర్శిస్తున్నారు. అనంతపురం జిల్లాలో కీలక నియోజకవర్గంగా ఉన్న సింగనమలకు ఇన్చార్జిగా పిసిసి మాజీ అధ్యక్షుడు సాకే శైలజా నాథ్ ను నియమించారు. తద్వారా ఇక నుంచి రాజకీయంగా దూకుడు నిర్ణయాలు తీసుకుంటానని సంకేతాలు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేసిన శైలజానాథ్ ఇటీవల రాజీనామా చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి రాయలసీమ వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చింది. 2014 ఎన్నికల్లో టిడిపి కంటే ఎక్కువ సీట్లు రాయలసీమలో వైసిపి దక్కించుకుంది. 2019లో అయితే మూడు సీట్లు తప్పించి అన్ని స్థానాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కానీ 2024 వచ్చేసరికి సీన్ మారింది. అయితే అనంతపురం జిల్లా మాత్రం ఎప్పుడు ఇబ్బందికరంగా మారుతోంది. అందుకే అక్కడ పాగా వేయాలంటే కీలక నేతలను మచ్చిక చేసుకోవాలని చూశారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగానే సాకే శైలజానాథ్ ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకున్నారు. మరో పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరతారని ప్రచారం జరుగుతోంది.సాకే శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు. 2004లో సింగనమల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2009లో రెండోసారి గెలిచి సత్తా చాటారు. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత కిరణ్ కుమార్ రెడ్డి అధికారం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సాకే శైలజనాథ్ మంత్రిగా కూడా వ్యవహరించారు. 2014లో రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దారుణంగా మారింది. అయినా సరే అదే పార్టీలో కొనసాగారు శైలజనాథ్. కాంగ్రెస్ హై కమాండ్ శైలజానాద్కు పిసిసి అధ్యక్ష పదవి కూడా అప్పగించింది. అయితే 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ ఏమాత్రం ప్రభావం చూపలేదు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరితేనే ప్రయోజనం అని సాకే శైలజనాథ్ భావించారు. కొద్ది నెలల కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.సాకే శైలజనాథ్ సేవలను వినియోగించుకోవాలని చూశారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీలో కూడా ఆయనకు చోటిచ్చారు. తాజాగా సింగనమల వైయస్సార్ కాంగ్రెస్ ఇన్చార్జిగా నియమించారు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సింగనమలలో ఓడిపోయింది. 2019లో మాత్రం జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2024 ఎన్నికల్లో పద్మావతిని కాదని వీరాంజనేయులకు ఇక్కడ వైసిపి టికెట్ ఇచ్చారు. కూటమి ప్రభంజనంలో వీరాంజనేయులు ఓడిపోయారు. అయితే ఎప్పటి వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా వీరాంజనేయులు ఉండేవారు. ఆయనను కాదని ఇప్పుడు సాకే శైలజానాథ్ ను ఇన్చార్జిగా నియమించారు జగన్మోహన్ రెడ్డి

# కూటమి ప్రభుత్వానికి వెంటాడుతున్న ప్రమాదాలు

**విశాఖపట్టణం, మే 2, పెన్ పవర్:**ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయింది. పాలనాపరంగా ఇప్పుడిప్పుడే ప్రభుత్వం కుదుటపడుతోంది. మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భావిస్తోంది. అదే సమయంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధపడింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. ఇటువంటి సమయంలో ఏపీలో విపత్తులు, వివాదాలు, ప్రమాదాలు ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పది నెలల్లోనే ఏపీ ప్రభుత్వం చాలా రకాల విపత్తులను ఎదుర్కొంది. ప్రభుత్వానికి అవి సవాల్ గా మారాయి. అయినా సరే కూటమి ప్రభుత్వం తట్టుకొని ముందుకు సాగుతోంది. సహజంగానే విపత్తులను, ప్రమాదాలను ప్రతిపక్షం రాజకీయాలు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుతం జరుగుతున్నది అదే.గత ఏడాది జూన్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సెప్టెంబర్లో విజయవాడను బుడమేరు ముంచేసింది. దీంతో వేలాది కుటుంబాలు వరదల్లో చిక్కుకున్నాయి. లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారు. కనీసం ఆహారం కూడా వారికి దొరకని పరిస్థితి. అటువంటి సమయంలో సీఎం చంద్రబాబు నేనున్నాను అంటూ బాధితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. రోజుల తరబడి విజయవాడలోనే మకాం వేసి బాధితులకు స్వయంగా వరద నీటిలోనే వెళ్లి పరామర్శించారు. వారికి అన్ని విధాల సాయం చేశారు. రాత్రికి రాత్రి వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు వర్కౌట్ అయ్యాయి. అయితే ఈ కష్టం నుంచి బయటపడే క్రమంలో.. ఏలూరులోని ఎర్ర కాలువ పొంగింది. వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో ఇబ్బందులు తప్పలేదు.అటు తర్వాత ఫార్మా కంపెనీల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. విశాఖ జిల్లా అచ్యుతాపురం సమీపంలో ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఉద్యోగులతో పాటు కార్మికులు చనిపోయారు. అటు తర్వాత కాకినాడలోని పరిశ్రమలో సైతం ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల పరామర్శ, వారికి పరిహారం అందించడంలో ప్రభుత్వం ముందంజలో నిలిచింది. క్యాబినెట్ మంత్రులు సైతం నేరుగా



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ప్రభుత్వపరంగా అండగా నిలిచారు.ఈ ఏడాది జనవరిలో తిరుమల వెంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల పంపిణీలో అపశృతి జరిగింది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు చనిపోయారు. ఇది పెను వివాదానికి దారితీసింది. మృతుల కుటుంబాలకు టీటీడీతో పాటు ప్రభుత్వం అండగా నిలిచింది. పరిహారం కూడా అందించింది. అంతకుముందు టీటీడీ లడ్డు ప్రసాదం వివాదం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. మరోవైపు తూర్పుగోదావరి జిల్లాలో బాణాసంచా పేలుడు కారణంగా 8 మంది చనిపోయారు. తాజాగా సింహాచలంలో జరిగిన ఘటనలో భక్తులు మరణించారు. ఇప్పుడు వారికి ప్రభుత్వం పరిహారం కూడా అందించింది. ప్రభుత్వం పాలనలో మునిగి తేలుతున్న తరుణంలో ఇలా ప్రమాదాలు, వివాదాలు, విపత్తులు.. తీవ్ర ఇబ్బందికరంగా మారుతున్నాయి. మరి వీటన్నింటినీ తట్టుకొని కూటమి ప్రభుత్వం ఎలా నిలబడుతుందో చూడాలి.

# దేశానికి మద్దతుగా రైతులు

**బెంగళూరు, మే 2, పెన్ పవర్:**

దాయాది దేశం పాకిస్తాన్ ఇప్పటికే ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం, ఆహార సంక్షోభం వంటి వాటితో ఇబ్బంది పడుతూనే ఉంది. పాక్ వాసులకు తినడానికి తిండి కూడా లభించని స్టేజ్ లో ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడి నేపథ్యంలో పాకిస్తాన్ పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతుంది. అంతేకాదు భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాకిస్తాన్ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు ఇప్పుడు కర్ణాటక రైతులు తమ వంతు అన్నట్లు పాక్ దేశానికి టమాటా ఎగుమతులు నిలిపివేశారు. మార్కెట్ మొత్తం ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద టమోటా మార్కెట్‌గా గుర్తింపు పొందింది. అదే కారణంతో కోలార్ జిల్లాలో పండించే నాణ్యమైన టమోటాలు దేశంలోని చాలా రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తారు. జూన్, జూలై నెలలు టమోటా పంట కోతకు అనువైన నెలలు. ఈ సందర్భంగా ఇక్కడి రైతులు కోలార్ నుంచి పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, దుబాయ్ వంటి వివిధ దేశాలకు టమోటాలను ఎగుమతి చేస్తారు. అయితే ఇటీవల కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు ఉగ్రవాద దాడి చేసి 27 మందిని చంపారు. దీని కారణంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పాకిస్తాన్‌పై దౌత్యపరంగా అనేక చర్యలు చేపట్టింది. ఇప్పుడు కోలార్‌లోని రైతులు తాము పండించిన టమోటాలను పాకిస్తాన్‌కు ఎగుమతి చేయడం నిలిపి వేశారు. ఇలాంటి చర్యలతో కోలార్ రైతులు పాకిస్తాన్‌ను కూడా దిగ్భ్రాంతికి గురిచేశారు.పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కోలార్ లోని రైతులు, వ్యాపారులు పాకిస్తాన్ పై మరో సర్జికల్ స్ట్రైక్ ప్రకటించారు. కోలార్ నుంచి పాకిస్తాన్‌కు టమోటాలు సరఫరా చేయడంపై పూర్తి నిషేధం ప్రకటించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్తాన్‌కు టమోటాలు సరఫరా చేయకూడదని రైతులు నిర్ణయించుకున్నారు.

ప్రతి సంవత్సరం కోలార్ నుంచి 800 నుంచి 900 టన్నుల టమోటాలు పాకిస్తాన్‌కు సరఫరా అయ్యేవి. అయితే పహల్గామ్ దాడి నేపథ్యంలో వ్యాపారులు ఇకపై పాకిస్తాన్‌కు ఒక్క టమోటా కూడా పంపకూడదని నిర్ణయించుకున్నారు. ఇక్కడి వ్యాపారులకు పాకిస్తాన్ తో విడదీయరాని సంబంధం ఉంది. వాళ్ళు టమోటాలతో పాటు కూరగాయలను కూడా పంపేవారు. దీని ద్వారా ఇక్కడి రైతులు, వ్యాపారులు పాకిస్తాన్‌తో కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నారు. అయితే ఉగ్రవాదులు మతం అడిగి మరీ మరణ హోమం సృష్టించడంతో రైతులు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మారారు.తమకు నష్టాలు కలిగినా పాకిస్తాన్‌కు టమోటాలు ఎగుమతి చేయడమని రైతులు చెబుతున్నారు. 2013లో పుల్వామా దాడి సమయంలో పాకిస్తాన్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నప్పుడు.. కోలార్ రైతులు కూడా ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు పాకిస్తాన్ కు కోలార్ నుంచి టమోటాల ఎగుమతిని నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉన్నామని కోలార్ రైతులు కూడా చెబుతున్నారు.పాకిస్తాన్ ఉగ్రవాదులకు సపోర్ట్ చేయడం మానెయ్యాలని.. కేంద్ర ప్రభుత్వం నీరు.. ఇతర వస్తువులపై ఆంక్షలు విధించగా, కోలార్ రైతులు ఒక అడుగు ముందుకు వేసి టమోటాలు, కూరగాయల సరఫరాని నిలిపివేసి పాక్ ప్రజలకు షాక్ ఇచ్చారు. దీని వలన పాకిస్తాన్ ప్రజలు టమోటాలు, కూరగాయల కోసం ఇబ్బంది పడటం అనివార్యం.

# సైబర్ ఉచ్చులో చదువుకున్నవాళ్లే ఎక్కువ

**హైదరాబాద్, మే 2, పెన్ పవర్:**హైదరబాద్ మియాపూర్‌కు చెందిన 40 ఏళ్ల ఐటీ ఉద్యోగి, ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ యాడ్ ద్వారా ట్రేడింగ్ స్కామ్‌కు గురై ?38.62 లక్షలు కోల్పోయాడు. వ్యాపారంలో ?1.3 కోట్లు లాభాలుగా చూపించినా, అతని ఖాతాలో జమయిన మొత్తం కేవలం ?200 మాత్రమే. ఈ కేసును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.బాధితుడు మొదట ఓ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఈ గ్రూప్‌లో "ప్రియా శర్మ"గా తాను పరిచయం చేసుకున్న యువతి అతనికి ట్రేడింగ్ గురించీ, అధిక లాభాలు పొందే పద్ధతుల గురించీ వివరించింది. ఆమె అతనికి "%ూూఖ% ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ" అనే యాప్ ఉపయోగించమని సూచించింది. దీనివల్ల బ్లాక్ ట్రేడ్స్, అప్పర్ సర్క్యూట్ స్టాక్స్ వంటి విషయాల్లో మోహపూరితమైన వ్యూహాలతో అతన్ని పెట్టుబడి పెట్టించేందుకు ప్రోత్సహించిందివాట్సాప్ గ్రూప్‌లో వేరే సభ్యుల ద్వారా ఇచ్చిన టెస్ట్‌మోనియల్స్, స్క్రీన్‌షాట్‌లతో ఆకర్షితుడైన బాధితుడు తొలుత ?50,000 పెట్టుబడి పెట్టి, తరువాత నెమ్మదిగా పెంచుతూ మొత్తం ?14.87 లక్షలు పెట్టాడు. మొత్తంగా అతను తన ఖాతా మరియు భార్య ఖాతా ద్వారా ?38.62 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు.ట్రేడింగ్ జరుగుతున్న సమయంలో ప్రియా అతనికి ?1 కోటి లాభాలు వచ్చాయని చెప్పింది. కానీ, ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు ముందు, ?18 లక్షలు ట్యాక్స్ క్లియరెన్స్ పేరుతో డిమాండ్ చేసింది. బాధితుడు ఈ మొత్తం తన లాభాల నుంచి తీసుకోమని అడిగినప్పుడు, ఆమె దానికి అంగీకరించకుండా.. ట్యాక్స్‌ను వేరుగా చెల్లించాల్సిందేనని చెప్పింది.ఇంకొక సంఘటనలో, హైదరాబాద్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తిని ఇండియామార్ట్ అనే వాణిజ్య వెబ్‌సైట్‌లో ట్రాన్స్మిషన్ లైన్ టూల్స్ కోసం వెతుకుతున్న సమయంలో, మోసగాళ్లు ?1,17,646కు మోసగించారు. %ఖూ% ఎంటర్‌ప్రైజెస్ అనే పేరుతో పర్సనల్ జాయింట్ అకౌంట్‌కు చెందినట్లుగా తమను పరిచయం చేసుకున్నారు. బాధితుడికి ఫోన్లో మాట్లాడి పర్చేజ్ ఆర్డర్ పంపించారు.ఏప్రిల్ 5న ?1,17,646 చెల్లింపును బాధితుడు చేశాడు. అయితే అప్పటి నుంచి అతనికి ఎటువంటి సరుకు రాలేదు. ఫాలో అప్‌లో, మోసగాళ్లు వాట్సాప్ ద్వారా మరిన్ని నకిలీ రసీదులు, షిప్పింగ్ డాక్యుమెంట్లు పంపించారు.సిటీ సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి మాట్లాడుతూ, "బాధితుల ఫిర్యాదుల ఆధారంగా మోసగాళ్లను గుర్తించే పనిలో ఉన్నాం" అన్నారు.

# రాజకీయాలకు బుట్టా గుడ్ బై




**కర్నూలు, మే 2, పెన్ పవర్:** వ్యాపార రంగంలో ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. పారిశ్రామిక, వ్యాపార రంగాల నుంచి రాజకీయాల వైపు వచ్చినవారు చాలా అప్రమత్తంగా ఉంటారు. పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు. లేకుంటే ఇబ్బందులు తప్పవని వారికి తెలుసు. అయితే ఈ విషయంలో మూల్యం చెల్లించుకున్నారు మాజీ ఎంపీ బుట్టా రేణుక. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రేణుక 2014 ఎన్నికల్లో కర్నూలు ఎంపీగా గెలిచారు. అత్యంత సీనియర్ నేతగా ఉన్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ని ఓడించి లోక్ సభలో అడుగుపెట్టారు. అటు తరువాత రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలు ఆమె పాలిట శాపంగా మారాయి.2014లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం గౌరవప్రదమైన స్థానాలను తెచ్చుకొని ప్రతిపక్షంగా ఉంది. బుట్టా రేణుక ఎంపీగా గెలిచి పార్లమెంట్లో అడుగుపెట్టారు. విద్యాధికురాలిగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా గుర్తింపు పొందారు రేణుక. అయితే 2018లో ఆమె టిడిపిలో చేరాలని నిర్ణయించుకున్నారు. అక్కడ నుంచి ఆమె కౌంట్ డౌన్ మొదలైంది. తెలుగుదేశం పార్టీలో చేరినా.. ఆమెకు కోరుకున్న సీటు దక్కలేదు. కనీసం ఎక్కడా సర్దుబాటు కూడా చేయలేదు. దీంతో టీడీపీలోకి వచ్చినట్టే వచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి వెళ్ళిపోయారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకొనసాగి ఉంటే 2019లో సైతం ఆమెకే కర్నూలు పార్లమెంట్ టికెట్ ఇచ్చేవారు. టిడిపిలోకి వెళ్లి తిరిగి రావడంతో ఆమెకు టికెట్ నిరాకరించారు జగన్మోహన్ రెడ్డి. 2019 నుంచి 2024 మధ్య ఆమె పార్టీకి తన సమయాన్ని కేటాయించాల్సి వచ్చింది. అయితే అధినేతను ఎలాగోలా ఒప్పించి 2019లో ఎమ్మిగనూరు అసెంబ్లీ టికెట్ ఇప్పించుకున్నారు రేణుక. సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని తప్పించి మరి జగన్ ఆమెకు టికెట్ ఇచ్చారు. బీసీ తారక మంత్రం పనిచేస్తుందని భావించారు. కానీ కూటమి ప్రభంజనంలో బుట్టా రేణుక ఓడిపోయారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి రూపంలో ఆమెకు వ్యతిరేక వర్గం ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఆ వర్గం వ్యతిరేకించింది. ప్రస్తుతం కూడా వ్యతిరేకిస్తూనే ఉంది. ఇంకోవైపు వ్యాపారంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆమె ఆస్తులు వేలానికి సిద్ధంగా ఉన్నాయి. అటు రాజకీయంగా కలిసి రాక.. ఇటు వ్యాపార పరంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అయితే రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వ్యాపార రంగం తిందని ఆమె బాధపడుతున్నారు. అందుకే రాజకీయాలనుంచి నిష్క్రమించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి ఆమె నిర్ణయం ఎలా ఉంటుందో.

# బొబ్బిలి యుద్ధంలో నెగ్గిన కూటమి




**విజయనగరం, మే 2, పెన్ పవర్:**విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు కూటమి నేతలు. అందుకోసం పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకున్నారు. ఎలాగైనా మున్సిపల్ పీఠం దక్కించుకోవాలని కూటమి నేతలు, తమ పీఠాన్ని పదిలపరచుకోవాలని వైసీపీ నేతలు ఎవరికి వారే పక్కా స్కెచ్ తో క్యాంప్ పొలిటికల్స్‌కి తెరలేపినా చివరికి కూటమి నేతలే నెగ్గారు. ఈ అంశంతో విజయనగరం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా రసవత్తరంగా మారాయి.నాలుగేళ్ల క్రితం వైసీపీ దక్కించుకున్న బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ పదవిని ఇప్పుడు అధికార కూటమి దక్కించుకునేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీపై ఎలాగైనా తమ జెండా ఎగురవేయాలని కూటమి చేసిన ప్రయత్నం సక్సెస్ ఫుల్ గా నెరవేరింది. అవిశ్వాసానికి కావలసిన మ్యాజిక్ ఫిగర్ ను సొంతం చేసుకునేందుకు ముందుగానే వైసీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉండగా, అవిశ్వాస తీర్మానంలో చైర్మన్ కు వ్యతిరేకంగా 20 మంది ఓటేస్తే వైసీపీ చైర్మన్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. అనంతరం 16 మంది చేతులెత్తి కొత్త చైర్మన్ ను ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది.బొబ్బిలి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 31 వార్డులుండగా, వాటిలో పది వార్డులను టీడీపీ, 20 వైసీపీ, ఒక వార్డు ఇండిపెండెంట్ కైవసం చేసుకున్నారు. అయితే ఆ తరువాత ఒక వైసీపీ సభ్యుడు రాజీనామా చేయడంతో బొబ్బిలిలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఇండిపెండెంట్ తోపాటు మరో 9 మంది వైసీపీ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో టీడీపీ బలం 20కి చేరింది. ఎమ్మెల్యే బేబీనాయన ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఓటు హక్కు ఉండటంతో అవిశ్వాసం తీర్మానం నెగ్గటానికి ఎలాంటి ఢోకా లేదు. అవిశ్వాసానికి కావలసిన 20 మంది కౌన్సిలర్లు కూటమికి ఉండటంతో ఓటింగ్ సమయానికి వారిలో ఏ ఒక్కరు చేజారిపోకుండా క్యాంప్ పాలిటిక్స్ కి తెరలేపారు కూటమి నేతలు. వైసీపీ నుండి మద్దతు ఇస్తున్న తొమ్మిది మంది, ఒక ఇండిపెండెంట్ తోపాటు టీడీపీకి చెందిన10 మంది కౌన్సిలర్లను క్యాంప్‌లో ఉంచి నేరుగా ప్రత్యేక బస్సులో బొబ్బిలి మున్సిపల్ సమావేశ మందిరంకి తీసుకువచ్చారు. అయితే ఈ అవిశ్వాస తీర్మానంకు వైసీపీకి చెందిన మిగిలిన పది మంది కౌన్సిలర్లు కూడా హాజరయ్యారు. ఇక మునిసిపల్ సమావేశం ప్రారంభమైన తరువాత అవిశ్వాస తీర్మానం ప్రారంభించారు ఎన్నికల అధికారులు. అలా పెట్టిన అవిశ్వాసంలో కూటమి సభ్యులు 20 మందితో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడు ఎమ్మెల్యే బేబీనాయన కూడా అవిశ్వాస తీర్మానంకి అనుకూలంగా ఓటేయడంతో 21 ఓట్లతో అవిశ్వాసం నెగ్గి ప్రస్తుత చైర్మన్ సావు మురళీ కృష్ణ తన పదవిని కోల్పోయారు. ఆ తరువాత కొత్తగా ఎన్నుకోబోయే నూతన చైర్మన్ ఎవరు అన్న చర్చ కూడా జోరుగా సాగుతుంది. ఇక బొబ్బిలి మున్సిపాలిటీకి టీడీపీ సభ్యుడిని నూతన చైర్మన్ గా ఎన్నిక కావడం లాంఛనమే అయ్యింది.

# వైసీపీ ప్రక్షాళన దిశగా అడుగులు



**విజయవాడ, మే 2, పెన్ పవర్:** వైసీపీని ప్రక్షాళన చేసే పనిలో ఆపార్టీ అధినేత జగన్ తలమునకలయ్యారట. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు ముందుకు వేస్తున్నారని ఫ్యాన్ పార్టీలో చర్చ నడుస్తోంది. సరికొత్త వ్యూహాలకు పదును పెడుతూ పార్టీని ముందుకు నడిపించాలని జగన్ డిసైడ్ అయ్యారట. ఇప్పటివరకు ఒక లెక్క..ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా జగన్ పార్టీలో కీలక సంస్కరణలను చేపట్టబోతున్నారని పార్టీవర్గాల్లో టాక్ విన్పిస్తోంది. ఇకనుంచి పార్టీలో వికేంద్రీకరణ విధానం తీసుకురావాలని చూస్తున్నారట.వైసీపీలో దిగువ స్థాయి నుంచే పార్టీ ఎదగాలని వారే బాధ్యులుగా మారి సమర్థంగా పనిచేయాలని ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. అందుకే మొన్నటి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చేసిన సూచనలు..నేడు జిల్లా అధ్యక్షులు సమావేశంలో ఇస్తున్న దిశానిర్దేశం రెండింటిని పరిశీలిస్తే..పార్టీని నాయకులకే అప్పగిస్తున్నారన్న టాక్ పార్టీవర్గాల్లో విన్పిస్తోంది.జగన్ అధ్యక్షతన జరిగిన జిల్లా అధ్యక్షుల సమావేశంలో..పార్టీకి జిల్లా అధ్యక్షులే సర్వస్వం అన్నారట. మీరే పార్టీ..పార్టీనే మీరు అని క్లారిటీగా చెప్పేశారు. మీరే అన్ని రకాల బాధ్యతలు తీసుకోవాలని..ఎవరి కోసమో చూడొద్దని సూచించారు. మీకు ఎవరైనా ఆదేశిస్తారేమో అని ఎదురుచూడకుండా సొంత నిర్ణయాలు తీసుకోండి అని జగన్ ఫుల్ ఫ్రీడం ఇచ్చారట. జిల్లా పార్టీకి మీరే యజమానులు..మీ మాటే చెల్లుబాటు అవుతుంది.మీరే మొత్తం జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని గెలిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్ తో కలుపుకుని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అసెంబ్లీ పరిధిలో రెండు వర్గాలు ఉంటే వారిని కో ఆర్డినేట్ చేసి సమస్యలను పరిష్కారించుకోవాలని సూచించారని సమాచారం. అంతేకాదు బాగా పనిచేయని ఇంచార్జిల విషయంలో కూడా ఒకటికి పదిసార్లు పరిశీలన చేసి..ఆ తర్వాత వారు దారికి రాకపోతే మార్చేసే విషయంలోనూ మీదే కీలకపాత్ర అన్నారు.జగన్ ఇంతలా వారి మీదనే ఎందుకు బాధ్యతలు మోపుతున్నారన్న చర్చ పార్టీ నేతల్లో మొదలైందట. పీఏసీ సభ్యులకూ ఇదే విధంగా సూచించారట. అలాగే జిల్లా అధ్యక్షుల విషయంలో ఈ విధంగానే చెబుతున్నారు. దీంతో జగన్ అధికారాలను వికేంద్రీకరించి పార్టీని గ్రాస్ రూట్ లెవెల్ దాకా తీసుకెళ్ళాలని అనుకుంటున్నారా అన్న చర్చ సాగుతోంది. పార్టీ అధినేత జగన్ అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ నేతలు చెప్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తోంది.ఒకవైపు వైసీపీ ముఖ్య నేతలు వరుసగా అరెస్ట్ అవుతున్నారు. పైనున్న పెద్దలు దాకా కూడా ఈ అరెస్టులు రావచ్చు అన్న చర్చ సైతం పార్టీలో సాగుతోందట. అందుకే జగన్ అన్నీ చూసుకునే పార్టీని సమిష్టిగా నాయకులు అంతా కలసి నడిపే విధంగా ఈ కొత్త రకమైన రూపుని పార్టీకి అందిస్తున్నారని అంటున్నారు. ఏవైనా అనుకోని అవాంతరాలు ఏర్పడినా ఇబ్బందులు లేకుండా పార్టీ ముందుకు సాగాలని జగన్ ఆలోచిస్తున్నారని అంటున్నారు. పార్టీలో గత పరిస్థితులు ఇపుడు లేవని..అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారనే గుసగుసలు పార్టీవర్గాల్లో విన్పిస్తున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తట్టుకుని నిలబడేలా క్యాడర్ బేస్డ్ గా లీడర్ ఓరియేంటెడ్ గా పార్టీని తీర్చిదిద్దాలని జగన్ చూస్తున్నారని టాక్. మరి ఈ కొత్త రకమైన విధానం సక్సెస్ అయితే ఓకే గానీ, చిక్కుల్లా అందరికీ బాధ్యతలు ఇస్తే ఎవరు ఏంచేస్తారో అన్న సందేహం పార్టీ అధినేత జగన్ ను వెంటాడుతోందట. ఏది ఏమైనా వైసీపీ అధినాయకత్వం పార్టీని పటిష్టపరిచేందుకు సరికొత్త ఆలోచనలు చేస్తున్నట్లు పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది

# టచ్ మీ నాట్ గా పవన్



**గుంటూరు, మే 2, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజకీయాలను బాగానే అలవర్చుకున్నారు. టచ్ మి నాట్ గా ఉండటానికి అనేక కారణాలున్నాయంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితి కనుచూపు మేరలో బాగుపడే అవకాశం కనిపించడం లేదు. అప్పులు చేయాలి. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేయాలన్నా, నాలుగేళ్ల పాటు కొనసాగించాలన్నా చాలా కష్టమే. ఇప్పుడు సహకరించినట్లు కేంద్ర ప్రభుత్వం భవిష్యత్ లో సహకరించే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే దాని పరిమితులు దానికి ఉంటాయి. ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ మరింత టైట్ చేసే అవకాశం కేంద్రంలో కనిపిస్తుంది. తనపరిమితమవుతూ.. అందుకే పవన్ కల్యాణ్ ప్రతి విషయంలో పూసుకుని తిరగకుండా తన శాఖకే పరిమితమవ్వాలని నిర్ణయించుకున్నారు. కూటమి ప్రభుత్వమని అంటున్నా అది పూర్తిగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడానికే వదిలేశారు. అంటే మంచి జరిగినా, చెడు జరిగినా అది చంద్రబాబు నాయుడు ఖాతాలోకే వెళుతుంది. అమరావతి విషయాన్ని తీసుకుంటే ఇంత నిధులు పెట్టి ఎందుకు ఖర్చు చేయడం అన్న ప్రశ్న జనసేనానిలోనూ ఉంది. కానీ అదే అమరావతి సక్సెస్ అయితే? అదే సంపద సృష్టించే కేంద్రంగా మారితే? అందుకే ఆయన ప్రతి విషయంలో మౌనం పాటించినట్లే రాజధాని అమరావతి నిర్మాణం విషయంలోనూ మౌనంగా ఉండాలని నిర్ణయించారట. మళ్లీ భూసేకరణపై... ఇటీవల చంద్రబాబు నాయుడు అమరావతి రైతులతో సమావేశమై మరో నలభై నాలుగు వేల ఎకరాల సమీకరణను చేయాలని, గ్రీన్ కోర్ ఎయిర్ పోర్టుతో పాటు అనేక వాటికి భూమి అవసరమని ఆయన రైతులతో చెప్పారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తొలుత సేకరించిన 33 వేల ఎకరాలే ఎందుకని ప్రశ్నించిన పవన్ కల్యాణ్ దానికి తోడు నలభై నాలుగు వేల ఎకరాలు సేకరించాలన్న చంద్రబాబు నిర్ణయాన్ని కూడా తప్పుపట్టలేదు. అలాగే బహిరంగంగా సమర్థించలేదంటున్నారు. మనకు సంబంధం లేని విషయంగా ఆయన వ్యవహరిస్తున్నట్లే కనపడుతుంది. భవిష్యత్ లో బూమ్ రాంగ్ అయినా తాను సమర్థించలేదని చెప్పుకోవడానికి వీలవుతుందని సైలెంట్ గా ఉన్నారనిపిస్తుంది. . ఎంత సింహాచలం ఘటనపై... ఒక్క అమరావతి మాత్రమే కాదు.. ఏ ఘటన జరిగినా పెద్దగా ఆయన స్పందించడం లేదు. తిరుమలలో తొక్కిసలాట జరిగినప్పుడు అక్కడకు వెళ్లి ఊగిపోయిన పవన్ కల్యాణ్ నిన్న సింహాచలంలో గోడకూలి ఏడుగురు మరణిస్తే అక్కడకు వెళ్లకపోవడానికి కూడా కారణమదే అంటున్నారు. తాను అక్కడకు వెళితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాల్సి వస్తుందని, అందుకే అక్కడకు వెళ్లకుండా కామ్ గా ఉండి జరిగిన ఘటనను మాత్రం ఖండించారు. విచారాన్ని వెలిబుచ్చారు. పైగా హెూంమంత్రి వంగలపూడి అనితను కూడా అక్కడ ఘటన జరిగిన తర్వాత తీసుకున్న చర్యలపై ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. దీన్ని బట్టి పవన్ కల్యాణ్ కొంత దూరంగా ఉంటూనే పరిస్థితిని బట్టి తన మూవ్ అవ్వాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుందని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.

# జగన్ అందుకే దూరమా

**గుంటూరు, మే 2, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రధాని మోదీ పర్యటనకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అయితే జగన్ తీసుకున్న నిర్ణయం ఎంత వరకూ కరెక్ట్ అన్న ప్రశ్న తలెత్తుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తుంటే ప్రధాని మోదీని కలిసే అవకాశాన్ని జగన్ తనంతట తానే వదులుకున్నారని కొందరు అంటున్నారు. అదే సమయంలో దూరంగా ఉండటమే మేలన్న అభిప్రాయమూ వ్యక్తమవుతుంది. రాజధాని అమరావతి పనులకు శంకుస్థాపనలు చేయడానికి ప్రధాని మోదీ వచ్చారు.అమరావతికి చేరుకుని కేవలం గంట నుంచి రెండు గంటలు మాత్రమే జగన్ తాడేపల్లిలోని తన ఇంట్లోనే ఉన్న జగన్ గురువారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరి వెళ్లడంతో ఆయన ప్రధానిమోదీ పర్యటనకు హాజరు కూకడదని నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతుంది. ప్రొటోకాల్ అధికారులు జగన్ కు ప్రధాని మోదీ సభకు రావాలని ఆహ్వాన పత్రికను అందించడానికి తాడేపల్లి ఇంటికి వెళ్లినా జగన్ అందుబాటులో లేరని చెప్పడంతో దానిని ఆయన పీఏకు ఇచ్చి వచ్చారు. . సాయంత్రం 5.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి రాత్రి ఎనిమిది గంటలకు బెంగళూరుకు చేరుకోనుకున్నారు. జగన్ ప్రధాని మోదీ పర్యటనకు దూరంగా ఉండటానికి అనేక కారణాలున్నాయి.మామూలుగా పర్యటనకు వస్తే హాజరయినా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ తాను వ్యతిరేకించిన చోట అదే.. రాజధాని నిర్మాణాన్ని ఐదేళ్ల పాటు పక్కన పెట్టి, మూడు రాజధానులంటూ నినాదాన్ని అందుకున్న తాను ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడమే మంచిదన్న అభిప్రాయానికి జగన్ వచ్చి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు. ఒకవేళ ప్రధాని నరేంద్ర మోదీ కోసం వెళ్లి అవమానాల పాలు కావాల్సి వస్తుందేమోనన్న భయం కూడా జగన్ లో ఉంది. అందులోనూ తనకు నచ్చని, మెచ్చని అమరావతి పనులను ప్రారంభించే పనులకు హాజరైతే భవిష్యత్ లో రాజధాని విషయంలో అధికార పార్టీపై విమర్శలు చేయడానికి కుదరదన్న భావనతోనే జగన్ దూరంగా ఉన్నారని అంటున్నారు. జగన్ గా తాను వెళ్లినా.. వెళ్లకపోయినా అక్కడ పట్టించుకునే వారు పెద్దగా ఉండరు. అదే సమయంలో తాను హాజరయితే గత ఐదేళ్లు తాను చెప్పిన దానికి విలువ లేకుండా పోతుంది. మూడు రాజధానులంటూ వచ్చి అమరావతి పనుల నిర్మాణానికి ఎలా వచ్చారంటూ భవిష్యత్ లో జగన్ ను ప్రశ్నించే అవకాశం కూడా ఉంటుంది. అందుకే జగన్ ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి దూరంగా ఉండటమే మేలు అని నిర్ణయించుకుని ఒకరోజు ముందుగానే బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. రానున్న కాలంలో అమరావతి లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తనకు సంబంధం లేదన్న విషయాన్ని ఆయన స్పష్టం చేయడానికి అవకాశం దొరుకుతుందని కూడా అంచనా వేసుకుని ఆయన విమానమెక్కి వెళ్లిపోతున్నారట.

# 75 ఏళ్లలోనూ... ఏం స్టామినా

**తిరుపతి, మే 2, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందుకే నాలుగు సార్లు ముఖ్యమంత్రి కాగలిగారు. ఆయన నిత్యం జనంలో ఉండేందుకు ఇష్టపడతారు. ఎన్నడూ పార్టీ కార్యాలయంలోనో, తన ఆఫీసులోనో కూర్చుని ఉండటం ఆయనకు చేతకాదు. 1995లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ అదే జరుగుతుంది. వయసు పెరిగే కొద్దీ కొంత అలసట తో పాటు అలసత్వం కూడా వస్తుంది. కానీ చంద్రబాబు లో ఈ రెండు కానరవావు. ఒకరకంగా అదే చంద్రబాబు నాయుడు సక్సెస్ సీక్రెట్ అని చెప్పాలి. ప్రజల్లో ఉండాలని పరితపించడమంటే మామూలు విషయం కాదు. తాను చేయలేని విషయాలను చేయలేనని చెప్పే గట్స్ కూడా లీడర్ అనే వారికి ఉండాలి. అది చంద్రబాబులో పుష్కలంగా ఉన్నాయి. 1995లో అంటే అప్పుడు కొద్దిగా ఓపిగ్గా ఉండబట్టి ప్రతి రోజూ జిల్లాలు తిరిగే వారు. రోజుకు పద్దెనిమిది గంటలు పనిసే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారు. 24 %శ% 7 అందుబాటులో ఉండేందుకే ప్రయత్నిస్తారు. ఇటీవల తన పుట్టిన రోజు వేడుకలను జరపుకునేందుకు యూరప్ పర్యటనకు వెళ్లి ఐదు రోజులు గడిపి ఢిల్లీకి వచ్చారు. అర్ధరాత్రి ఢిల్లీకి చేరినా ఉదయం నుంచి కేంద్ర మంత్రులతో వరసగా సమావేశమై రాష్ట్రాభివృద్ధికి సంబంధించి, అనేక ప్రాజెక్టుల గురించి చర్చించారు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఒంగోలులో హత్యకు గురయిన వీరయ్య చౌదరి అంతిమ సంస్కారంలో పాల్గొనేందుకు ప్రకాశం జిల్లాలోని నాగులుప్పలపాడు బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి మళ్లీ విశాఖకు వెళ్లి కాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన చంద్రమౌళి భౌతిక కాయానికి నివాళులర్పించారు.నిజానికి ఈ పనులు ఆయన చేయకపోయినా పార్టీ నేతలను లేదా లోకేశ్ ను పంపే వీలుంది. కానీ చంద్రబాబు మాత్రం స్వయంగా వెళ్లి ఈ రెండు ఘటనలకు హాజరై వచ్చిన విషయం అందరినీ అబ్బుర పర్చింది. ఈ స్టామినా నేటి యువతరం నేతలకు ఎందుకు లేదు? అన్న కామెంట్స్ బలంగా వినిపించాయి. ఆయన ఓపికకు హేట్సాఫ్ చెప్పితీరాల్సిందేనని అంటున్నారు. మొన్నటి వరకూ అంటే గత ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ కూడా ఇలా పర్యటనలు చేయలేదు. తక్కువలో తక్కువగా ఏదైనా బహిరంగ సభకు మాత్రమే హాజరయ్యేవారు. కానీ చంద్రబాబు నాయుడు పార్టీ కార్యకర్తల హత్య జరిగినా, మరో ఘటన జరిగినా తానే స్వయంగా వెళ్లి పాల్గొనడంతో ఆయన పట్ల మరింత క్రేజ్ పెరగడానికి కారణమయింది. ఫస్ట్ తారీఖు వచ్చిందంటే చాలు... ఇక మొదటి తేదీ వచ్చిందంటే చాటు... చంద్రబాబు కాళ్లు ఒక పట్టాన నిలవవు. నిజానికి తాను స్వయంగా వెళ్లి పింఛన్లు అందచేయాల్సిన అవసరం ఏమీ లేదు. ఎందుకంటే పింఛను మొత్తాన్ని తాను వచ్చిన తర్వాతనే ఒక్కసారిగా నాలుగు వేల రూపాయలకు పెంచారు. దీనికి పెద్దగా ప్రచారం చేసుకోవాల్సిన అవసరమూ లేదు. అయినా సరే ప్రతినెల మొదటి తారీఖు వచ్చిందంటే చాలు.. వెంటనే ఏదో ఒక జిల్లాలో వాలిపోతారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు ఇంటికి వెళ్లి పింఛను ఇస్తారు. అంతటితో ఆగకుండా వారి ఇంట్లోనే టీ తయారు చేసి అందరికీ ఇస్తారు. ఈరోజు కూడా ఆయన నెల్లూరు జిల్లా పర్యటనకు వెళుతున్నారు. వాస్తవానికి రేపు మోదీ పర్యటన ఉన్నందున తాను వెళ్లకుండా ఉండే అవకాశమున్నప్పటికీ తన డైరీని మాత్రం ఆయన మార్చరే మార్చరు. అందుకు నేడు నెల్లూరు జిల్లాలో పర్యటించడమే ఉదాహరణ. మొత్తం మీద చంద్రబాబు నాయుడు ప్రచారం కోసమే

## మరో ఆస్ట్రేలియన్ క్రికెటర్‌పై పాంటింగ్ గురి.. మ్యాక్స్ వెల్ స్థానంలో స్టార్ బ్యాటర్ కు ఛాన్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 లో పంజాబ్ కింగ్స్ కు బిగ్ షాక్ తగలింది. ఆ జట్టు స్టార్ ఆల్ రౌండర్ గ్లెన్ మ్యాక్స్ వెల్ ఐపీఎల్ 2025 సీజన్ మొత్తానికి దూరం అయ్యాడు. చేతి వేలి గాయం కారణంగా ఈ ఆసీస్ స్టార్ మిగిలిన సీజన్ కు దూరమయ్యాడు. బుధవారం (ఏప్రిల్ 30) చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ తో జరుగుతున్న మ్యాచ్ లో మ్యాక్సీ ఆడలేదు. మ్యాక్స్ వెల్ లాంటి స్టార్ ఆల్ రౌండర్ దూరం కావడంతో ఇప్పుడు పంజాబ్ కింగ్స్ ఈ ఆసీస్ స్టార్ స్థానంలో ఎవరిని ఎంపిక చేయాలనే డైలమాలో పడింది. ఐపీఎల్ తో పాటు సమాంతరంగా పాకిస్థాన్ సూపర్ లీగ్ జరగడంతో రీప్లేస్ చేయడానికి ఆటగాళ్లు కరువవ్వడమే ఇందుకు కారణం. మ్యాక్స్ వెల్ స్థానంలో పంజాబ్ హెడ్ కోచ్ గా వ్యవహరిస్తున్న రికీ పాంటింగ్.. ఆస్ట్రేలియా వెటరన్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ను తీసుకునే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. స్మిత్ గత ఏడాది మేజర్ లీగ్ క్రికెట్ లో అదరగొట్టాడు. ఈ ఏడాది ప్రారంభంలోనూ సిడ్నీ సిక్సర్స్ తరపున సెంచరీతో మెరిశాడు. స్మిత్ ను తీసుకోవడం మంచి ఎంపికే అయినా పాంటింగ్ మీద విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే పంజాబ్ జట్టులో మార్కస్ స్టోయిన్స్, జోష్ ఇంగ్లిస్, బార్ట్ లెట్, మ్యాక్స్ వెల్ ఉంటే ఇప్పుడు మరో ఆసీస్ క్రికెటర్ ను పంజాబ్ జట్టులో చేర్చడానికి పాంటింగ్ ప్రయత్నాలు చేయడం ఎవరికీ నచ్చడం లేదు. పాంటింగ్ కావాలనే తమ క్రికెటర్లకు అవకాశం ఇస్తున్నాడని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
మ్యాక్స్ వెల్ ఈ సీజన్ లో ఘోర ప్రదర్శన చేశాడు. మెగా ఆక్షన్ లో పంజాబ్ అతన్ని నమ్మి రూ. 4.2 కోట్లకు తీసుకుంటే గుజరాత్ టైటాన్స్ తో జరిగిన తొలి మ్యాచ్ లోనే డకౌటయ్యాడు. ఆడిన తొలి బంతికే సాయి కిషోర్ ఫ్యాన్స్ రివర్స్ స్వీప్ ఆడి ఎల్బీడబ్ల్యూ రూపంలో వికెట్ సమర్పించుకున్నాడు. ఓవరాల్ గా 6 ఇన్నింగ్స్‌లలో కేవలం 48 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్ లో 4 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ ఆడిన 10 మ్యాచ్ ల్లో 6 మ్యాచ్ ల్లో గెలిచి 13 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. మరో నాలుగు మ్యాచ్ లు ఆడాల్సి ఉన్న నేపథ్యంలో ప్లే ఆఫ్స్ కు ముందు ఎవరికి ఛాన్స్ దక్కుతుందో అనే విషయం ఆసక్తికరంగా మారింది.

## నన్ను సెలక్ట్ చేయండి.. ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్ గెలిపిస్తా: టీమిండియా వెటరన్ బ్యాటర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరగబోయే ప్రతిష్టాత్మక టెస్ట్ సిరీస్ కు భారత క్రికెట్ జట్టులో స్థానం కోసం టీమిండియా వెటరన్ బ్యాటర్ చటేశ్వర్ పుజారా పోరాడుతున్నాడు. 2023 దక్షిణాఫ్రికా టూర్ లో భాగంగా టెస్టు జట్టు నుంచి ఈ సీనియర్ ప్లేయర్ ను సెలక్టర్లు తప్పించిన సంగతి తెలిసిందే. 2020 నుండి పుజారా ఫామ్ దిగజారుతూ వస్తుంది. గత నాలుగేళ్లలో పుజారా భారత్ తరపున 28 టెస్టు మ్యాచ్ లాడితే యావరేజ్ 30 కంటే తక్కువగానే ఉంది. కేవలం ఒకసారి మాత్రమే మూడంకెల స్కోర్ ను చేరుకోగలిగాడు. నిలకడగా రాణించలేకపోవడం పుజారాకు మైనస్ గా మారింది. తాజాగా తనను సెలక్ట్ చేయాల్సిందిగా పుజారా సెలక్టర్లకు సెలక్టర్లకు సంకేతాలు పంపిస్తున్నాడు. పుజారా మాట్లాడుతూ.. " భారత జట్టులో పోటీ చాలా కఠినంగా ఉంటుంది. 100 టెస్టులాడినా నన్ను పట్టించుకోకపోవడం నిరాశకు గురి చేస్తుంది. అట పట్ల నాకున్న ప్రేమ నన్ను ఇంకా భారత జట్టుకు ఆడాలని ప్రేరేపిస్తుంది. దాదాపు 20 సంవత్సరాలుగా ఇంగ్లాండ్‌లో భారత జట్టు సిరీస్ గెలవలేదు. నాకు అవకాశం వస్తే నా నుండి అత్యుత్తమంగా రాణించి జట్టుకు ట్రోఫీ అందించే ప్రయత్నం చేస్తాను. నేను ప్రస్తుతం మంచి ఫామ్ లోనే ఉన్నాను. డొమెస్టిక్, అంతర్జాతీయ లీగ్ ల్లో రాణిస్తున్నాను". అని పుజారా రెవ్‌స్పోర్ట్జ్‌తో మాట్లాడుతూ అన్నారు.
ఇంగ్లాండ్ తో జూన్ 20 నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. ఐపీఎల్ అయిపోయిన వెంటనే వారం రోజుల గ్యాప్ లో భారత జట్టు ఇంగ్లాండ్ కు పయనమవనుంది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్ వేదికగా 5 టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ఆడాల్సి ఉంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్స్ షిప్ 2025-27 సైకిల్ లో టీమిండియాకు ఇదే తొలి సిరీస్. ఈ సిరీస్ కు భారత జట్టును మే రెండో వారంలో ప్రకటించే అవకాశం ఉంది. ఈ సారి ఇండియా ఎక్కువగా యంగ్ ప్లేయర్లతోనే బరిలోకి దిగబోతుంది. ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ కు ముందు ఇంగ్లాండ్ లయన్స్ తో యంగ్ ఇండియా రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ల సిరీస్ ఆడుతుంది. హెడ్డింగ్లేలో జూన్ 20 న తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. సిరీస్‌లోని మిగతా నాలుగు టెస్టులకు ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్ ట్రాఫోర్డ్ ఓవల్ వేదికలు కానున్నాయి. 2021-22 చివరిసారిగా భారత్ ఇంగ్లాండ్ లో పర్యటించింది. ఈ సిరీస్ 2-2 తో సమంగా ముగిసింది. ఈ ఏడాది ప్రారంభంలో ఇంగ్లాండ్, భారత్ చివరిసారిగా టెస్ట్ సిరీస్ ఆడాయి. భారత్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్ ఉత్కంఠభరితంగా సాగుతుందని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రిచర్డ్ గౌల్డ్ ఆశిస్తున్నాడు.

## ఇండియాలో పాకిస్థాన్ స్టార్ క్రికెటర్ల ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్స్ బ్లాక్.. బాబర్, రిజ్వాన్‌తో పాటు మరో ముగ్గురు




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రభుత్వం పాకిస్తాన్ స్టార్ క్రికెటర్లపై ఝలక్ ఇచ్చింది. టాప్ ప్లేయర్స్ బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్ యొక్క ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్స్ ను బ్లాక్ చేసింది. హసన్ అలీ, షాహీన్ అఫ్రిది, ఇమామ్-ఉల్-హక్ తో పాటు అనేక మంది పాకిస్తాన్ ఆటగాళ్ల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను ఇండియాలో బ్లాక్ చేయబడ్డాయి. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించిన తర్వాత ఈ చర్య తీసుకోబడింది. ఉగ్రవాద దాడి తర్వాత భారత ప్రభుత్వం డిజిటల్ కంటెంట్‌పై, ముఖ్యంగా పాకిస్తానీ జాతీయులను లక్ష్యంగా చేసుకుని ఈ కఠిన చర్యలు చేపట్టనున్నట్టు తెలుస్తుంది. పాకిస్తాన్ క్రికెట్ ఇన్ఫ్లుయెన్సర్ ఫరీద్ ఖాన్ యొక్క %శ% ఖాతాను ఇటీవల భారతదేశంలో బ్లాక్ చేశారు. ఇండియాలో అనేక స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్‌లను నిషేధించారు. ఈ నిషేధించబడిన స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్‌లలో పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు తన్వీర్ అహ్మద్, షోయబ్ అక్తర్, షాహిద్ అఫ్రిది, రషీద్ లతీఫ్, బాసిత్ అలీ ఖాతాలు కూడా ఉన్నాయి. ఈ లిస్ట్ లో బిబిఎన్ స్పోర్ట్స్, సమా స్పోర్ట్స్ కూడా ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం ఇండియాలో పాకిస్థాన్ సూపర్ లీగ్ మ్యాచ్ లు లైవ్ స్ట్రీమింగ్ ఆగిపోయింది. భారత స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ ఫ్యాన్‌కోడ్ గురువారం (ఏప్రిల్ 24) ఇండియాలో పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025 ప్రసారాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 11 నుంచి పాకిస్థాన్ సూపర్ లీగ్ ప్రారంభమైంది. మే 18 వరకు జరగనున్న ఈ టోర్నీలో మొత్తం 31 మ్యాచ్ లు జరగనున్నాయి. రావల్పిండి క్వాలిఫైయర్ 1తో సహా టోర్నమెంట్‌లోని 11 మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఉగ్రవాదుల నరమేధం తర్వాత.. బీసీసీఐ ఇకపై పాకిస్తాన్ తో క్రికెట్ మ్యాచ్ లు ఆడేది లేదని స్పష్టం చేసింది. తటస్థ వేదికలపైన కూడా పాక్ తో మ్యాచ్ లు ఆడేది లేదని.. ఇది ఫైనల్ అని తేల్చి చెప్పింది బీసీసీఐ. దీని ప్రకారం భారత్, పాకిస్థాన్ జట్లు ఇకపై కేవలం ఐసీసీ టోర్నీల్లో మాత్రమే తలబడనున్నాయి. ఐసీసీ ఈవెంట్స్ లో కూడా రెండు జట్లు ఒక గ్రూప్ లో ఉండేందుకు వీలు లేదని ఐసీసీ తేల్చి చెప్పింది.

డిజైనర్ డ్రెస్‌లో కరిష్మా తన్నా అబ్బురపరిచే క్లిక్‌లు



# ఇప్పుడు బుట్ట బొమ్మ పరిస్థితి ఏంటి..?



బుట్ట బొమ్మ పూజా హెగ్డే టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా కొనసాగింది ఐతే రాధే శ్యాం తర్వాత సడెన్ గా ఆమెకు ఛాన్సులు రాకుండా పోయాయి. తెలుగులో ఆమెకు ఉన్న ఫాలోయింగ్ కి సినిమాలు చేస్తే వర్క్ అవుట్ అవుతుంది కానీ ఒక్కటంటే ఒక్క ఆఫర్ కూడా ఆమెకు రాలేదు. గుంటూరు కారం సినిమా నుంచి ఆమె ఎగ్జిట్ అవ్వడం కూడా పూజా హెగ్డే తెలుగు ఆఫర్లు రాకపోవడానికి కారణమని అంటారు. ఐతే తెలుగులో పరిస్థితి ఇలా ఉంటే కోలీవుడ్ లో అరకొర అవకాశాలతో నెట్టుకొస్తుంది పూజా హెగ్దే.ఓ పక్క బాలీవుడ్ లో కూడా సినిమాలైతే చేస్తుంది కానీ అక్కడ సక్సెస్ రేటు చాలా తక్కువ ఉంది. సల్మాన్ తో చేసిన సినిమా ఫ్లాప్ అవగా రీసెంట్ గా వచ్చిన షాహిద్ కపూర్ దేవ్ కూడా నిరాశ మిగిల్చింది. నెక్స్ట్ అమ్మడు వరుణ్ ధావన్ తో సినిమాకు రెడీ అవుతుందని తెలిసింది. ఐతే లేటెస్ట్ గా అమ్మడు కోలీవుడ్ హీరో సూర్యతో ఒక సినిమా చేసిన విషయం తెలిసిందే. తమిళ్ లో క్రేజీగా తెరకెక్కిన ఈ సినిమా తెలుగులో కూడా రిలీజైంది.ఐతే ఆ సినిమా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న పూజా హెగ్దే తీరా రిజల్ట్ చూశాక డిజప్పాయింట్ అయ్యింది. సూర్య వింటేజ్ లుక్స్, మాస్ యాక్షన్ ఇవన్నీ ఉన్నా కేవలం కొద్దిమందికి అది కూడా కార్తీక్ సుబ్బరాజ్ స్టైల్ సినిమాలను ఇష్టపడే వారికే ఈ మూవీ నచ్చుతుంది. అందులోనూ పూజా హెగ్దే డీ గ్లామర్ లుక్ ఆమెకు అసలు సూటవ్వలేదు. పూజా బేబీ సినిమాలో ఉంది అంటే గ్లామర్ షో నెక్స్ట్ లెవెల్ అనేలా ఉంటుంది.అదే ఎక్స్ పెక్టేషన్స్ తో సినిమాకు వెళ్లిన వారు నిరాశ చెందుతున్నారు. పూజా హెగ్దే కూడా ఇక మీదట ఇలాంటి సినిమాలే చేయాలని అనుకుంటున్నా అంటూ చెప్పగా అమ్మడు ఈ సినిమా రిజల్ట్ తో షాక్ అయ్యే ఉంటుంది. కొంతమంది హీరోయిన్స్ డీ గ్లామర్ లుక్, నో మేకప్ లుక్ తో తమ అభినయంతో మెప్పిస్తారు. కానీ పూజా హెగ్దేకి గ్లామర్ పరంగానే క్రేజ్ ఉంది. సో తప్పకుండా అమ్మడు ఈ టైప్ రోల్స్ చేస్తే ఆమె కెరీర్ కి హెల్ప్ అవ్వడం సంగతి అటుంచితే ఉన్న ఇమేజ్ కూడా పోయి అసలు ఏ ఛాన్స్ లు రాకుండా ఉంటాయి. పూజా హెగ్దే మాత్రం ఈసారి తన నటనతో ఆడియన్స్ ని మెప్పిస్తా అని అనుకోగా రియాక్షన్ మాత్రం ఆమెను షాక్ అయ్యేలా చేస్తుందని చెప్పొచ్చు.



నీలి రంగులో నికితా దత్తా యొక్క ట్రెండీ ఫోటోషూట్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com